KSR02B1141C

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
అక్టోబర్ 09, 2016



అమ్మలుగన్న దసరా

స్టాంప్‌లపై తారలు

ఒకప్పటి మూకీ చిత్రాల నుండి నేటి టాకీ చిత్రాల వరకు విస్తరిస్తున్న చిత్ర సీమలో లెజెండరీ హీరోయిన్లుగా ఎంతో మంది పేరు తెచ్చుకున్నారు. దశాబ్దాల పాటు తమ నటనతో మెప్పించిన దేవి కుమారి, నూతన్, కన్నా దేవి, మీనా కుమారి, మధుబాల, నర్గీస్ లాంటి బాలీవుడ్ నటులెందరినో ప్రేక్షకులు మదిలో ముద్రించుకుంటే ఆ నటులు ఎప్పటికీ గుర్తుండిపోయేలా భారత ప్రభుత్వం వారి పేరుతో స్టాంపుల్ని ముద్రించాయి. మన దేశంలో నటుల మరణానంతరం స్మారకంగా వారి చిత్రాలతో పోస్టల్ స్టాంపులని విడుదల చేస్తారు. ఖండాంతరాల్లోనూ తారల అభిమానులుండడంతో వర్తమాన నటుల చిత్రాలతో విదేశాల్లో స్టాంపులు విడుదలయ్యాయి. ఆఫ్రికాలోని ఎస్ టోమ్ ప్రిన్సిపి, రిపబ్లిక్ ఆఫ్ ది గునియా దీవుల్లో హేమమాలిని, అమీర్, షారుక్, కాజోల్, ఐష్, కత్రినా కైఫ్, అమితాబ్‌ల ముఖ చిత్రంతో విడుదలైన స్టాంపులు దర్శనమిస్తున్నాయి. ఇలాంటి అరుదైన సత్కారాన్ని ఇటీవలే అందుకున్నారు కుర్బాని చిత్ర కథానాయిక. దమ్ మారో దమ్ మిట్ జాయె హమ్... అంటూ ప్రేక్షకుల్ని మైకంలోకి తీసుకెళ్లిన 70ల నాటి ఆరాధ్య తార జీనత్. సినిమా రంగానికి జీనత్ జీవిత కాల కృషికిగాను నార్వేలో జరిగిన 14వ బాలీవుడ్ ఫెస్టివల్‌లో ఆమె ముఖచిత్రంతో స్టాంపును విడుదల చేసింది నార్వే పోస్టల్ డిపార్ట్‌మెంట్.



జీనత్ అమన్



ENTERED
KSR02B141

మానస్ పుత్రుడు

బిభూతి లహాకర్ అస్సాంకి చెందిన ఒక సామాజిక, పర్యావరణ కార్యకర్తగా మారక ముందు ఓ అటవీ పరిశోధకుడు. మానస్ పచ్చిక బయళ్లపై పీహెచ్‌డీ చేసేందుకు వచ్చిన ఆయన ఆ అడవి తల్లి బిడ్డగా మారి అక్కడి జీవ వైవిధ్యాన్ని కాపాడే పర్యావరణవేత్త అయ్యాడు. 20 ఏళ్లుగా మానస్‌లోని జీవవైవిధ్యాన్ని కాపాడటంతో పాటు అక్కడి ప్రజల అభివృద్ధికి కృషి చేసినందుకు ఈ ఏడాది ఐయుఎన్‌సిఐ హెరిటేజ్ హీరోస్ అవార్డ్‌కి ఎంపికయ్యాడు.

స్ఫూర్తి

టెరాయ్ పచ్చిక బయళ్లు, భాబర్ పచ్చిక బయళ్లతో కలసి ఓ వినూత్న జీవావాసాలకు ఆలవాలమైన ప్రపంచంలోని ఒకే ఒక ప్రాంతం మానస్ జాతీయ వనం. హిమాలయాలకు ఆనుకుని ఏటవాలు అటవీ ప్రాంతాలుగా చాలా విలక్షణంగా ఉండే మానస్ జీవవైవిధ్యానికి హాట్ స్పాట్ కూడా. వేలాది పక్షి జాతులకు నెలవు. అరుదైన, అంతరించిపోతున్న ప్రపంచంలో మరెక్కడా లేని పిగ్మీ హాగ్ (మరగుజ్జు పంది) వంటి వందలాది రకాల జంతువులకిది ఆవాసం. 1973లో పులుల సంరక్షణకు చేపట్టిన ప్రాజెక్ట్ టైగర్‌లో తొలుత ఎంచుకున్న అటవీ ప్రాంతాల్లో మానస్ ఒకటి. ఈ జీవ వైవిధ్య పరిరక్షణ కోసం అంకితమయ్యాడు లహాకర్.

ఆందోళనల మధ్యే..

1980లో బోడోల్యాండ్ కోసం ఆందోళనలు తీవ్ర రూపం దాల్చాయి. మానస్ జాతీయ వనంలో చెట్లని విచ్చల విడిగా నరికి అధికంగా కలప తరలించారు. స్థానిక వేటగాళ్ల కారణంగా కొన్ని జంతుజాతులు అంతరించిపోతున్నాయి. అక్కడ జీవవైవిధ్యం ప్రమాదకర స్థాయికి పతనమైంది. 1992లో యునెస్కో వరల్డ్ హెరిటేజ్ వెబ్‌సైట్‌లో అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్న జాతీయ పార్కుల్లో మానస్ పేరు చేరిపోయింది. పచ్చిక బయళ్ల అటవీ ప్రాంతంపై పీహెచ్‌డి చేస్తున్న లహాకర్ అదే సమయంలో అక్కడకు పరిశోధక బృందంలో ఓ సభ్యుడిగా చేరుకున్నాడు. 1993లో కొందరు అస్సామీ సైంటిస్టులతో కలిసి అరణ్యక్ అనే ఎన్‌జివో సంస్థతో పనిచేయడం ప్రారంభించాడు. ఉగ్రవాదుల భయం ఉన్నా కూడా ప్రాణాల్ని లెక్కచేయకుండా పరిశోధన కోసం రోజూ అడవిలో తిరిగేవాడు. చాలా మంది అక్కడ పరిశోధనలు చేసేందుకు భయపడ్డారు. అటవీ అధికారులతోనే కాక స్థానికులతోను సత్సంబంధాలు ఏర్పరచుకుంటేనే తన పరిశోధన తేలికవుతుందని తెలుసుకున్నాడు. బయటి వ్యక్తులతో అస్సలు కలవని స్థానికులతో నానా తంటాలు పడి స్నేహం చేయగలిగాడు. ఎకో టూరిజమ్, వన్యప్రాణి పర్యవేక్షణ వంటి విషయాల్లో తానే స్థానిక యువతకు శిక్షణనివ్వడం మొదలు పెట్టాడు. ఆయన్ను నమ్మిన స్థానికులు తమ జనావాసాల్లో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు అనుమతించారు. అలా వారికి జీవనోపాధుల గురించి వివరిస్తూనే మానస్ జీవ వైవిధ్యం గురించి ప్రత్యేకతలేంటో కూడా చెప్పేవాడు.

అక్రమవేటగాళ్లే సంరక్షకులుగా..

వన్య ప్రాణులు, కలప, ఇతర అటవీ ఉత్పత్తుల స్మగ్లింగ్‌లో అక్రమ వేటగాళ్లు చురుకుగా పాల్గొనేవారు. లహాకర్ చేపట్టిన కార్యక్రమాలని వారు మొదట్లో అడ్డుకునేవారు. స్థానికులు కూడా రోజు వారి అవసరాలకు అడవులపైనే ఎక్కువగా అధారపడటంతో చెట్ల నరికివేతను ఆపడం చాలా కష్టమైంది. అక్రమ వేట, చెట్ల నరికివేత వంటి కేసుల నుంచి వేటగాళ్లను తప్పించి వారినే సంరక్షకులుగా మార్చేందుకు కీలక కృషి చేశాడు లహాకర్. స్థానికుల పక్షాన అటవీ అధికారులతో మాట్లాడి అక్రమ వేటగాళ్లు తిరిగి సాధారణ జీవితం గడిపేలా అవకాశాల్ని కల్పించాడు. ఈ ప్రయత్నాలతో అక్రమ వేట నుంచి స్థానికులు తప్పుకుని అటవీ పరిరక్షణకు చేయికలిపారు. వారినే పాట్రోలింగ్‌కు నియమించి జీవనోపాధి కల్పించి స్థిరపరిచాడు. ఇలాంటి వేటగాళ్లు సుమారు 600 మంది ఉన్నారు. మహిళలతో స్వయం స్వహాయక బృందాల్ని ఏర్పాటు చేసి ఆహారం, అల్లికలు, చేపల వేట వంటి రంగాల ద్వారా ఆదాయం పొందేలా శిక్షణనిప్పించి మార్కెట్ చేశారు. 2008లో పీహెచ్‌డీ పూర్తయినా మానస్‌ను ఆయన వదల్లేదు. దానికే అంకితమై సేవలు అందిస్తున్నాడు. తరచూ అక్కడ ఏనుగులు, మనుషుల మధ్య దాడులు జరిగేవి. వీటిని అడ్డుకునేందుకు సుమారు 1000 గిరిజన గృహాల్ని కాచేందుకు ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయించారు. ఇది 14 కి.మీ.ల పొడవున ఉంటుంది. ప్రభుత్వం, స్థానికులు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో బిభూతి ఈ కంచెను 2013లో ఏర్పాటు చేయించారు. అప్పటి నుంచి దాడి ఘటనలు జరగలేదు. మానస్‌ను భూటాన్‌లోని రాయల్ మానస్ జాతీయ వనంతో కలిపే పెద్ద ప్రయత్నం ఆయన ద్వారానే సాధ్యపడింది. దీని వల్ల రెండు దేశాల్లోని అటవీ ప్రాంత పర్యవేక్షణకు చాలా అడ్డంకులు తొలగి అక్రమ వేట, చెట్ల నరికివేత తదితర సమస్యలకు పరిష్కారం తేలికైంది. మానస్‌లో తొలి జీఐఎస్ సర్వేలు కూడా ఆయనే చేయించాడు. ప్రస్తుతం పంబారీ ప్రాంతంలో నర్సరీని అభివృద్ధి చేస్తూ స్థానికుల ఉపాధి అవకాశాలు మరింత మెరుగయ్యేందుకు కృషి చేస్తున్నాడు. పచ్చిక బయళ్ల అటవీ ప్రాంత పరిరక్షణకు ఆయన అభివృద్ధి చేసిన ఈ మోడల్‌ను ప్రపంచవ్యాప్తంగా వినియోగించేందుకు కార్యక్రమాలు రూపుదిద్దుకుంటున్నాయి. ఒకప్పుడు ప్రమాదకర స్థాయిలో ఉన్న మానస్ నేషనల్ పార్క్ పేరును 2011లో యునెస్కో ఆ జాబితా నుంచి తొలగించింది. ప్రకృతి పరిరక్షణ కోసం లహాకర్ చేసిన ప్రయాణంలో ఆయన భార్య నమిత కూడా భాగస్వామ్యురాలే. ఐయుఎన్‌సిఐ హెరిటేజ్ హీరోస్ అవార్డ్‌కి ఆసియా నుండి ఎంపికైన తొలి వ్యక్తి లహాకర్.

– శారద

ఇండెక్స్

స్టార్.................3
రీల్‌లో రియల్ లైఫ్ బాక్సర్ సేవ........4

పని మనసు
నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం..........10
మెలనిన్ దేవత

ప్రత్యేకం.............. 11
ఓ సృజన యాత్ర

కవిత్వమ్...............14
డెడ్‌లైన్

అమ్మలుగన్న దసరా

అట్టమీది కథ...6

సందర్భం - 12

విందులు.. వింతలు

తెలుసా...................15
చిట్టితల్లి నవ్వాలి

కథ 16
రథయాత్ర

రుచి.....................21
కొబ్బరి బొబ్బట్లు

బాల నేస్తాలు............23
ఫెల్ట్ పక్షి

పద వికాసం.....
....24

ఆకట్టుకున్న అట్టమీది కథ

25-9-2016 నాటి స్నేహ సంచిక ఆకట్టుకుంది. అట్టమీది కథ 'రెండో బాల్యం'లో వృద్ధుల సాధక బాధకాలు వారి జీవన చిత్రణ ఎంతో విశ్లేషణాత్మకంగా అందించారు. కవిత్వమ్‌లో కవితలు భావగర్భితంగా ఉన్నాయి. కంచె కథకర్తకు అభినందనలు. 'గడ్డం గ్యాంగ్' చిత్రాలు గమ్మత్తుగా ఉన్నాయి. లక్షలు వద్దనుకుని, లక్ష్యం గురించి జీవితాన్నే పణంగా పెట్టి కృషి చేస్తున్న పూజ వంటి వారికెప్పుడూ ఓటమి ఉండదు. చెట్టు డాక్టర్ విజయకాంత్ గారికి హ్యాట్సాఫ్. నవ్వుల్ పువ్వుల్ అదుర్స్.

నేమాన సుభాష్ చంద్రబోస్,

విశాఖపట్నం

చెట్టుడాక్టర్

25-9-2016 ఆదివారం అనుబంధంలో 'చెట్టు డాక్టర్' నన్ను ఎంతో ఆకట్టుకుంది. చెట్టుకు కూడా ప్రాణం ఉందని ఎన్నో ఏళ్ల క్రితమే జగదీష్ చంద్రబోస్‌గారు ప్రయోగాలు చేసి నిరూపించారు. అడవుల నుంచే మానవులు, జంతుజాలాలకు ఆహారం లభిస్తుంది. గతంలో అశోక చక్రవర్తి, కృష్ణదేవరాయల పాలనలో అడవిని కాపాడేందుకు చెట్లను నాటించారు. చెట్లు లేని కారణంగా మానవుని జీవన విధానానికి భంగం వాటిల్లుచున్నది. చెట్లకు హాని



కలగకుండా విజయకాంత్ చేస్తున్న కృషి అభినందనీయం. వయోవృద్ధులకు ఆదరణ చాలా దారుణంగా మారుతున్నది. ఇది చాలా హృదయ విదారకమైన విషయం.

కై.ప నాగరాజు, అనంతపురం

రెండోబాల్యం

రెండో బాల్యం అట్టమీది కథ చాలా బాగుంది. మన దేశంలోవున్న వృద్ధుల గురించి చాలా చక్కగా వివరించారు. మొదటి బాల్యంలో ప్రతి ఒక్కరు ప్రేమానురాగాలతో చూస్తారు. రెండో బాల్యంలో అనేక సమస్యలను ఎదుర్కొంటూ అయినవారికి దూరంగా ఉంటూ మానసికంగా కృంగిపోతున్న వృద్ధులకు ఎంతో ధైర్యాన్ని నింపుతుంది. ప్రతి ఒక్కరూ తమ కుటుంబంలో పెద్ద వయసులో వున్న తల్లిదండ్రుల గురించి, తమ బాధ్యతల గురించి తెలుసుకునేలా ఉంది 'రెండో బాల్యం'. వృద్ధాప్యంలో వున్న వారు ఆరోగ్యంగా వుండడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో చక్కగా వివరించారు. రెండో బాల్యం గురించి చక్కటి సమాచారాన్ని అందించినందుకు స్నేహ ఆదివారం అనుబంధంకు ధన్యవాదాలు.

-కె. సంతోషం, విశాఖపట్నం.

పారాలింపిక్స్ వీరులు

ఓటమిని తట్టుకోలేక చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతుంటారు. ఓటమి గెలుపునకు పునాది అనే భావనతో ముందుకు సాగి విజయాల్ని సాధించిన కొందరు పారాలింపియన్లు ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. వృద్ధుల సమస్యల్ని వృద్ధాశ్రమాలు తీర్చలేవని చెప్పిన రెండో బాల్యం ఆకట్టుకుంది. బామ్మల చీర్స్, వేలితో మాట్లాడండి, ఈ సంగీతం ప్రత్యేకం, రీల్‌పై రియల్ లైఫ్, కార్టూన్ పంచ్, జోక్స్ బాగున్నాయి. ఓ మొక్కను పెంచుకున్నా బావుండేది, వీరులు కవిత, కంచె కథ చదివించాయి.

ఎన్. పద్మనాభం, విజయవాడ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ. -520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

రీల్‌లో రియల్ లైఫ్

బాక్సర్

మనం రాణించాలనుకున్న రంగంలో బాగా ఎదిగితే అబ్బో...ఆ ఆనందానికి అవధులుండవులెండి. ఆ రంగమే తండ్రి కల అయితే దాన్నసలు చెప్పలేం. కానీ అనుకోని విధంగా మరొక రంగంలో ఏదో చిన్న అవకాశం వచ్చినప్పుడు అదీ చేద్దాం లే అని చేస్తాం. ఆ పని మనకి జాతీయ స్థాయిలో గౌరవం తెచ్చిపెడితే..నమ్మలేం. ఎందుకంటే అందులో మన ప్రావీణ్యత ఎంతో తెలుసు కదా. మనకెందు కొస్తుందలే అనుకుంటాం. అదే నిజమని తెలిస్తే... ఎగిరిగెంతేస్తాం. అదే జరిగింది బాక్సర్..నటి రితికా మోహన్ సింగ్ జీవితంలో. రియల్ బాక్సర్‌కు రీల్ లైఫ్‌లో చేసిన బాక్సింగ్ పేరుతెచ్చిపెట్టింది. రితికా తొలి సినిమాలో తన నటనకు జాతీయ స్థాయిలో అవార్డు వరించింది. ఇప్పుడు సినిమా అవకాశాలు తెచ్చిపెడుతోంది.

ముంబాయిలో షాపూర్జి పల్లోంజి కంపెనీలో హెచ్ ఆర్ మేనేజర్ మోహన్ సింగ్. కిక్ బాక్సర్ కూడా. ఈయన సుమారుగా 200 మందికి బాక్సింగ్‌లో తర్ఫీదు ఇస్తుంటాడు. ఇటువంటి వ్యక్తి పిల్లలు సాధారణంగా ఏమవుతారని మనం ఊహిస్తాం. మనం ఏం ఊహించామో తన పిల్లలను కూడా అదే చేద్దామని అనుకున్నారు మోహన్. మోహన్ తనయే రితికా మోహన్ సింగ్. ఆ అమ్మాయేనండీ...'సాలా ఖదూస్' చిత్రంలో మాధవన్ దగ్గర శిక్షణ పొందిన బాక్సర్. అదీ రీల్ లైఫ్‌లో...రితికా రియల్ లైఫ్‌లోనూ బాక్సర్. మిక్స్‌డ్ ఆర్ట్‌లో నైపుణ్యం ఉన్న స్పోర్ట్స్ పెర్సన్ కూడా. రితికా సింగ్‌ను బాక్సర్‌ను చేయాలని, ప్రపంచ స్థాయిలో భారతదేశం తరపున గెలిపించాలని కోరిక ఆమె తండ్రి మోహన్ సింగ్‌ది. అందుకే బాక్సింగ్‌నే కాకుండా మిక్స్‌డ్ మార్షియల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇప్పించారు. ఈమెతో పాటు తన తమ్ముడుకీ ఇదే తర్ఫీదు ఇచ్చారు.

- 2009లో వియత్నాంలో జరిగిన ఏషియన్ ఇన్‌డోర్ గేమ్‌లో రితికాలు పార్టిస్పేట్ చేసింది. 2012లో బిల్ దొసాంఝ్, బ్రిటీష్ ప్రో బాక్సర్ అండ్ ఒలింపిక్ ఛాంపియన్ నిర్వహించిన సూపర్ ఫైట్ లీగ్ (ప్రపంచ రెండో మిక్స్‌డ్ మార్షియల్ ఆర్ట్ లీగ్) పాల్గొంది రితికా. ప్రపంచ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కూడా పాల్గొంది.
- గుంటూరుకు చెందిన చెన్నై బేసిడ్ డైరెక్టర్ ప్రసాద్ కంగర, హీరో మాధవన్ కాంబినేషన్ 'సాలా ఖదూస్'ను స్పోర్ట్స్ నేపథ్యంలో రూపొందించాలని ఆలోచన వచ్చింది. కానీ కథ ప్రకారం బాక్సింగ్‌లో కాస్తా నైపుణ్యం, చూడ్డానికి కొద్దిగైనా అందంగా ఉండాలి. దాంతో పాటు 18 –20ఏళ్ల మధ్యే అమ్మాయి ఉండాలి. దీని కోసం ఆడిషన్స్ మీద ఆడిషన్స్ చేస్తున్నారు. సుమారుగా 100కు పైనే చేశారు. చాలా మంది బాక్సర్స్ ఆడిషన్స్‌కు వస్తున్నారు కానీ చిత్రబృందానికి ఎవరూ నచ్చడం లేదు.
- ఈ తరుణంలో 'తను వెడ్స్ మను' దర్శకుడు రాజ్ కుమార్ హిరానీకి ఓ ఆలోచన తట్టింది. రితికా సింగ్‌ను పెట్టి సినిమా చేద్దామని మాధవన్‌కు చెప్పారు. మాధవన్ మొదట ఎందుకో వినీవిన్నట్టుగా విన్నాడు. కానీ రితికా గురించి పూర్తిగా చెప్పేసరికి ఓకే చేసేశాడు. అలా రితికా 'సాలా ఖదూస్' సినిమాలో రీల్ లైఫ్ బాక్సర్‌గా, కథానాయికగా అవకాశం వచ్చింది.
- ఈ సినిమాయే కదా ఎలా ఉంటుందో చేద్దామని రితికా కూడా అంగీకరించింది. నటిగాను, బాక్సర్‌గా రెండు విధాలుగా ఈ సినిమాకు ఏటువంటి శిక్షణ లేకుండానే చేసిందట రితికా.
- ఈ సినిమా తమిళ్, హిందీ భాషల్లో రూపొందింది. ఒకేసారి రెండు భాషల్లోనూ విడుదలైంది. ఊహించని విజయం వచ్చింది. అంతే కాదు రితికా సింగ్ అప్పటికే బాక్సర్ కావడం, ఈ సినిమాలో కథానాయికగా నటించడంతో మరింత పాపులార్టీ వచ్చింది.
- ఈ సినిమాలో నటించినందుకు గాను ఈమెకు 63వ జాతీయ ఫిల్మ్ అవార్డు వరించింది. ఈ అవార్డు ప్రకటించినప్పుడు రితికా ఫోన్ స్విచ్ఛాఫ్ అయి ఉంది. తర్వాత మెసేజ్ వచ్చింది. అప్పుడు అదేదో ఫేక్ అనుకొని భావించింది. కానీ అందరూ అంటున్నా ఆటపట్టిస్తున్నారని అనుకుంది. ఏమో చూద్దామని గూగుల్‌లో సెర్చ్‌కొట్టి నిర్ధారించుకుంది. ఆ సమయంలో రితికా కళ్లు చెమర్చాయట. ఎందుకంటే మొదట సారి తన లైఫ్‌లో అవార్డు రావడమట.
- ఈ సినిమాలో తాను ఎలా చేయాలో అంతా మాధవనే చూసుకున్నారని ఆయనే కెమేరాకు దూరంగా ఉండి తనకు అన్నీ వివరించేవారని రితికా ఓ ఇంటర్వ్యూలో చెప్పింది.
- తానెప్పుడూ సినిమాల్లో నటిస్తానని ఊహించనే లేదని, సినిమా లైఫ్ ఎలా ఉన్నా ప్రపంచ బాక్సింగ్ పోటీల్లో గెలవాలన్నదే తన జీవిత కల అని చెబుతుంది రితికా.
- 'సాలా ఖదూస్' తర్వాత రితికా తమిళ్‌లో మణికందన్ దర్శకత్వంలో 'ఆందవాన్ కట్టలై'చిత్రంలో చేసింది. ఇందులో ఆధునిక యువతిగా చేసింది. ఇప్పుడు తెలుగు, తమిళ్‌లో రెండు చిత్రాల్లో నటిస్తోంది. తెలుగులో సాలా ఖదూస్‌ను వెంకటేష్ హీరోగా చేస్తున్నారు. ఇందులో రితికా కథానాయిక. తమిళ్‌లో రాఘవ లారెన్స్‌తో కలసి 'శివలింగ' అనే హార్రర్ సినిమాలో చేస్తోంది.

రితికా సింగ్

– కొప్పుశెట్టి దేవరాజు

నగరాల్లో జీవనం అంటే ఒక్కక్షణం కూడా తీరిక ఉండదు. అందుకే కొందరు ఇళ్లల్లో పనులు చేయడానికి పనిమనుషులను పెట్టుకుంటారు. అలా పనికి కుదిరే వారిలో చాలామంది ఆర్థిక స్థోమతలేక పిల్లలను బడికి పంపరు. అందరిలాగే వాళ్ళకూ ఓ కుటుంబం ఉంటుందనీ.. వాళ్ల పిల్లలకూ చదువు అవసరమని ఎంతమంది ఆలోచిస్తారు. అలాంటివారు ఎంత వెదికినా దొరకడం కాస్త కష్టమే అనిపిస్తుంది కదూ! కానీ, బెంగళూరులోని ఓ రెసిడెన్షియల్ సొసైటీ వారు మాత్రం అదేం పెద్ద కష్టమేం కాదు అంటున్నారు. అంతేకాదు, ఏకంగా పని మనుషుల పిల్లల్ని చదివించడమే పనిగా పెట్టుకున్నారు.

పని మనసు

సేవ

సాధారణంగా అపార్టుమెంట్‌లలో ఉండేవారు పని మనుషుల బాగోగులన్నీ అంతగా పట్టించుకోరు. ముద్దు పేర్లు, వరసలతో పిలుస్తున్నా కూడా ఆ అనుబంధం అక్కడితో ఆగిపోతుంటుంది. ఎక్కడో ఎవరో ఒకరు కుటుంబ సమస్యలు వినే ఓపిక చేసుకుంటారు. కుదిరితే అరకొర సాయానికి ఊకొడతారు. నిత్యం ఇంటిలో మనిషిగా మెదిలే పని మనిషి పరిస్థితే అలా ఉంటే ఇక వారి పిల్లల బాగోగుల గురించి అయితే వేరేగా చెప్పాలా! కానీ వీళ్లు అలాకాదు అనేలా బెంగళూరులోని టాటా షేర్‌వుడ్ రెసిడెన్షియల్ సొసైటీ గృహస్తులు ఓ మంచి మార్పుకు చేతులు కలిపారు. ఈ అపార్ట్‌మెంట్స్‌లో పనిచేసే (పనిమనిషి)వాళ్ల పిల్లలకు ప్రతి ఆదివారం సొసైటీ ఆధ్వర్యంలో రెండు గంటలు ప్రత్యేక ట్యూషన్ ఉంటుంది. అంతేకాదు, అపార్టుమెంటులో పనిచేసే వారి పిల్లల్ని బడిబాట పట్టించేందుకు అవసరమైన డబ్బును చందా రూపంలో వసూలు చేసి మరీ వారికి అందిస్తున్నారు.



ఓ ఘటన కదిలించి..

రెండేళ్ల క్రితం నాటి దీపావళీ పండుగ ముందు రోజు జరిగిన ఓ సంఘటన ఫలితంగా ప్రారంభమైందీ మార్పు. సొసైటీలో పనిచేసే వంటవాడు హఠాత్తుగా అనారోగ్యానికి గురయ్యాడు. ఆయన కుటుంబం వెంటనే హస్పటల్‌కి తీసుకెళ్లింది. అక్కడికి వెళ్లిన తర్వాత తెలిసింది. అతనికేదో ప్రేగుకు సంబంధించిన సమస్య ఉందని. ఆపరేషన్ కోసం 4 లక్షలు అవుతాయని చెప్పడంతో కుటుంబ సభ్యులకు ఏం చేయాలో పాలుపోలేదు. వారి కష్టం గురించి సొసైటీ సభ్యులకు తెలిసింది. ఇంటిదారులంతా కలసి చందా రూపంలో వసూలు చేసి సాయం చేయాలనుకున్నారు. కానీ ఎంత ప్రయత్నించినా అంత డబ్బు సమకూరలేదు. అంతా కలసి ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ సెక్షన్, ప్రభుత్వ సంస్థలు ఇలా చాలామందిని సాయం అడిగారు. సొసైటీకి సంబంధించిన గూగుల్ ప్లస్ సామాజిక మాధ్యమం గ్రూప్‌కి ఓ మెయిల్ చేశారు. 96 గంటల్లో 3 లక్షల రూపాయలు సమీకరించాడు. అలా కొంతమంది స్నేహితులు, బంధువులు అంతా కలిసి రూ. 4.5 లక్షలు పోగు చేశారు. ఆపరేషన్ విజయవంతంగా పూర్తయ్యింది. ఆ వంట మనిషి కొద్దిరోజుల్లోనే ఆరోగ్యంగా తిరిగి ఇంటికి వచ్చారు. ఇది ఎక్కడలేని ఆనందాన్ని, తృప్తిని నివాసకుల్లో కలిగించింది. అందరూ తలోచేయి వేస్తే ఓ మనిషి ప్రాణాన్ని నిలబెట్టొచ్చనే విషయం మాటల్లో కాక చేతల్లో తెలిసింది. అదే స్ఫూర్తిగా వారు మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలనుకున్నారు. వంట మనిషితోపాటు సాటి పని మనుషుల సమస్యల గురించి కూడా అప్పుడప్పుడు విన్నవారే. అందుకే వారి సంక్షేమానికి ఏదైనా చేయాలనే ఉద్దేశంతో సీకర్స్‌గా మారారు. సొసైటీ వాళ్లంతా కలిసి ఒక గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. అప్పటికే వారు సేకరించిన డబ్బులు కొంత మిగిలి ఉన్నాయి. వాటిని దేనికోసం ఉపయోగించాలా? అని బాగా ఆలోచించిన తర్వాత వారంతా కలిసి ఓ నిర్ణయానికి వచ్చారు. ఈ పోగయిన డబ్బులను షేర్వుడ్ సొసైటీలో పనిచేసే వారి పిల్లల స్కూల్ ఫీజులకు ఇస్తే సరిపోతుంది అని, అదే వారి మొదటి ఎజెండాగా తీసుకున్నారు. అలా అప్పటి నుంచి డబ్బులు సేకరించడం, దానిని వారి పిల్లల ఫీజులకు ఉపయోగించటం అనేది వారి కార్యక్రమంగా మారిపోయింది. దీని ప్రారంభం మొదటి సంవత్సరం ఒకటి నుంచి పదోతరగతి వరకు చదివే 40 మంది పిల్లల చదువులకు సహకారం అందించారు. ఇంత చేస్తున్నా వారికి ఏ మూలో పిల్లల చదువులపై చిన్న సందేహం కలిగింది. వెంటనే పిల్లల తల్లిదండ్రులను కలిశారు. వారితో మాట్లాడిన తర్వాత పిల్లలకు స్కూల్ ఫీజు కడితే సరిపోదని వారికి అర్థమైంది. దాంతో వారు ఓ నిర్ణయానికి వచ్చారు. పిల్లల స్కూల్ ఫీజుకు సరిపోయే డబ్బే కాకుండా వారికి ట్యూషన్ చెప్పడం మొదలుపెట్టారు. అందుకే ప్రతి ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి 9 గంటల వరకు 40 మంది పిల్లలకు ఇంగ్లీషు, గణితం సబ్జెక్ట్‌లు ట్యూషన్ చెబుతున్నారు.

ఏటా ఈ గ్రూప్ 175 మంది పిల్లలకు చందా పోగుచేస్తుంది. ఇంకో విషయం ఏంటంటే? పదోతరగతి పిల్లలకు వారం మొత్తం స్కూళ్లు తర్వాత ట్యూషన్ చెప్పేందుకు కొంతమంది సిద్ధమైయ్యారు. ఈ ఎనిమిది మంది వాలంటీర్లు మాత్రమే కాకుండా ఇంకా ఇప్పుడు ఆ గ్రూపులో మరో ఆరుగురు చేరారు. వాళ్లకు సమయం దొరికినప్పుడల్లా పిల్లలకు ట్యూషన్ చెప్పడమే పనిగా పెట్టుకున్నారు. వీరిలో ఎవరూ ఉపాధ్యాయులు లేరు. కానీ పిల్లలకు అర్థమయ్యే విధంగా చెప్పడానికి నైపుణ్యం సాధించి ప్రయత్నిస్తున్నారు. వారి వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే విధంగా చేస్తున్నారు. ఈ తరగతుల వల్ల పిల్లలు చాలా ఉత్సాహంగా ఉన్నారు.

- అమల తిలారు

నవ్వుల్ - పువ్వుల్

సీనియర్-జూనియర్



గిరి: సీనియర్‌కి జూనియర్‌కి తేడా ఏం(టా?

సూరి: సీ(sea)కి దగ్గరలో ఉన్న వాడు సీనియర్. జూ (zoo)కి దగ్గరలో ఉన్న వాడు జూనియర్.

లేరు

శ్రీను: హలో బావున్నారా?

వెంగళప్ప: లేరు. అక్కతో కలిసి ఇందాకే మార్కెట్‌కి వెళ్లారు.

ట్యాబ్లెట్

భార్య: ఏమండీ నాకెందుకో భయంగా ఉంది.

భర్త: మందులు వాడుతున్నావుగా ఇంకెందుకు భయం?

భార్య: నెల రోజుల నుండి ఐరన్ ట్యాబ్లెట్‌లు వాడుతున్నాగా అందుకే పేగులు తుప్పు పడతాయేమోనని.

బర్డ్ ఫ్లూ

టీచర్: బంటి నిన్న స్కూల్‌కి ఎందుకు రాలేదురా?

బంటి: నాకు బర్డ్ ఫ్లూ వచ్చింది టీచర్.

టీచర్: అది కోళ్లకి వస్తుంది రా..! మనుషులకి కాదు.

కిసుక్కు

టీచర్: పింకి ఏమడిగినా అలా వెనక్కి తిరిగి సమాధానం చెబుతున్నావేంటి?

పింకి: పెద్దలకు ఎదురు తిరిగి సమాధానం చెప్పకూడదని మీరే చెప్పారుగా టీచర్...!

పొరపాటు



భార్య: క్యూలో మీ ముందున్న అమ్మాయి వెనక్కి తిరిగి మిమ్మల్ని తిట్టింది ఎందుకని?

భర్త: పొరపాటుగా కాలు తొక్కాను...

భార్య: పొరపాటుగా తొక్కితే సారీ చెప్పొచ్చుగా.

భర్త: చెప్పాను... కంగారులో సారీకి బదులు నెవర్‌మైండ్ అని.

ఒక్క మార్కు

సుబ్బారావు: మన పక్కింటి రామారావుగారి అమ్మాయికి లెక్కల్లో తొంభై తొమ్మిది మార్కులు వచ్చాయి తెలుసా?

భార్య భాగ్యం: అవునా.... మరి ఆ ఒక్క మార్కు ఎవడెత్తికెళ్లాడట...!

సుబ్బారావు: ఇదిగో మన పుత్రరత్నం పట్టుకొచ్చాడు.

లవ్ రిప్లై

రచయిత గురునాథం కొడుకు ఒకమ్మాయికి ప్రేమలేఖ రాశాడు. అది చదివిన అమ్మాయి తండ్రి వీరేశం ఆవేశంగా గురునాథం దగ్గరికి వచ్చి..

వీరేశం: చూశారా మీ అబ్బాయి ఏం చేశాడో?

గురునాథం: ఏం చేశాడు?

వీరేశం: మా అమ్మాయికి లవ్ లెటర్ రాశాడు (చెప్పాడు ఆవేశంగా)

గురునాథం: ఎందుకంత ఆవేశంగా ఉన్నారు. రిప్లై కవర్ పెట్టడం మర్చిపోయాడా ఏంటి? బదులిచ్చేందుకు అంత దూరం నుంచి మీరు రావాల్సి వచ్చింది. అరెరె..

వీరేశం: ఆ....!



చిన్నూగాడు చేతివేలి గోళ్లు అదే పనిగా కొరుకుతున్నాడని పీఈటీ సార్ దగ్గరకు పంపాడు తెలుగు మాస్టారు. అలవాటు మానేందుకు ఎందుకన్నా మంచిదని ఆసనాలేయించాడాయన. పది రోజుల తర్వాత చిన్నూగాడు కాలివేలిగోళ్లు తేలిగ్గా నములుతూ కనిపించాడు.. తెలుగు మాస్టారుకి.

ఎవరు గొప్ప

అన్వేష్: నీ దృష్టిలో ఎవరు గొప్ప?

సుభాష్: అడిగిన వెంటనే సాయం చేసేవాడు.

అన్వేష్: అయితే ఓ వెయ్యి రూపాయలు సాయం చెయ్యి.

క-వి

భవాని: ఏమండీ మన పక్కింటాయన్ని అందరూ కవి కవి అనుంటున్నారు.. నిజంగా ఆయన కవేనా?

భాస్కర్: కాదే బాబు. అతడికి కనపడదు, వినపడదు.

ఫోన్ కాల్

సునీత: ఏమండీ త్వరలోనే మనం ముగ్గురం కాబోతున్నాం.

అప్పారావ్: యాహూ...మరి ఇంత మంచి విషయం ఇంత నెమ్మదిగా చెబుతున్నావేం.....అయినా ఈ విషయం పొద్దునెందుకు చెప్పలేదు. వచ్చేటప్పుడు గిఫ్ట్ తెచ్చేవాడ్ని కదా!

సునీత: నాకు మాత్రం ఏం తెలుసండీ....గంట క్రితమే ఫోన్ వచ్చింది.

అప్పారావ్: ఫోనేంటి?

సునీత: అదేనండీ మా అమ్మ మనింటికొస్తున్నట్టు గంట క్రితమే ఫోన్ చేసి చెప్పింది.

అమ్మలుగన్న దసరా

అమ్మలగన్న అమ్మ.. అనే దుర్గా దేవి స్త్రీ శక్తికి ప్రతీక. మాతృస్వామ్య వ్యవస్థల మూలాన్ని మనముందుంచే పండుగ దసరా. ఉత్తరాదిన రామాయణం ప్రధాన ఘట్టమైనా బెంగాల్, ఒడిశా, హిమాచల్ ప్రదేశ్‌తో పాటు మన దక్షిణాది రాష్ట్రాల్లో ప్రధాన ఉత్సవాలు ఆది శక్తివే. ఆది పరాశక్తిగా స్త్రీని ఆరాధించే ఈ పండుగ సంబరాల్లో కొన్ని ప్రత్యేకమైన కళల్లో పురుషాధిక్యత కనిపిస్తూనే ఉంది. వందల ఏళ్లుగా మహిళకు ప్రాధాన్యతలేని ఆ రంగాల్లో ఈ మధ్య మహిళల భాగస్వామ్యం పెరుగుతోంది. అది మట్టి ముద్దకు ప్రాణం పోసే కుమార్తులి విగ్రహ కళలో గానీ, అరివీర భయంకరంగా సాగే కేరళ పులికాళి నృత్యంగానీ. ఆ 'అమ్మలుగన్న దసరా' గురించి వివరిస్తుందీ వారం అట్టమీది కథ.

– క.వి.చుసరా

మనం చేసుకునే పండుగలు, ఉత్సవాలు, సంబరాల్లో మూఢ నమ్మకాలుంటాయి, చారిత్రక వాస్తవాలూ ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ఏవి మూఢ నమ్మకాలో, ఏవి చారిత్రక వాస్తవాలో చెప్పడం కష్టంగా ఉండవచ్చు కూడా. కాని చాలా పండుగలను విశ్లేషిస్తే అందులో దేవుళ్లూ, మహిమలకు సంబంధించిన నమ్మకాలనూ, వాటి చుట్టూ ఉన్న పురాణ గాథలనూ, ఆ గాథల వెనుకనున్న చారిత్రక వాస్తవాలను వేరుచేసి చూడగలుగుతాం. ఉదాహరణకు దసరా పండుగనే చూడండి. పదిరోజులు సాగే ఈ పర్వదినాల్లో చివరి రోజైన విజయ దశమినాడు ఉత్తరాదిలో రామలీల ఉత్సవాలు జరుపుతారు. ఆ రోజు రావణాసురునిపై రాముడు విజయం సాధించాడని వారి నమ్మకం. ఢిల్లీలోని రామలీలా మైదానంలో పెద్దపెద్ద రావణాసురిడి బొమ్మలు చేసి వాటికి టపాసులు అమరుస్తారు. రాముడు విడిచిపెట్టిన బాణం వెళ్లి రావణాసురుణ్ని తాకగానే అగ్గి రాజుకుంటుంది. పది తలల రావణాసురుడు కాలి బూడిదైపోతాడు. చెడుపై మంచి విజయం సాధించిన సందర్భంగా ఈ ఉత్సవం చేస్తారని చెబుతారు. అదే దక్షిణాదిలో అయితే దసరా సందర్భంగా రాముణ్ణి కొలవడం ఎక్కడా ఉండదు. ఆ రోజున అమ్మవారి పండుగలు జరపడమే దక్షిణాది ఆచారం. చాలా గ్రామాల్లో అమ్మవారి కొలుపులే దసరా ఉత్సవాలు. అమ్మలందరికీ ఆదిమాత అయిన దుర్గాదేవిని కొలవడం దక్షిణాదిలోనూ, బెంగాల్‌లోనూ ఆచారం. దుర్గామాత సింహారూఢురాలై మహిషాసురుడనే రాక్షసుణ్ణి వధించింది కాబట్టి ఈ రోజును పండుగగా జరుపుకుంటారు. ఇక్కడ కూడా కథ వేరుగాని చెడుపై మంచి విజయం అనేదే భావన. కాని ఇక్కడే సాంస్కృతిక తేడా కూడా కనిపిస్తుంది. ఉత్తరాది వారిది ప్రధానంగా ఆర్య సాంస్కృతిక వారసత్వం. ఆర్యులు పశుపోషకులు. వారిది ఆది నుండి పితృస్వామిక సమాజం. పితృస్వామిక సమాజంలో మగవారిదే ఆధిపత్యం. అందువల్ల వారి దేవుళ్లు, దేవతలు మగవారే. అందుకే వారి దసరా పండగ కథలో కథానాయకుడు పురుషుడు. కాని దక్షిణాది సమాజాలు వ్యవసాయ ప్రధాన సమాజాలు. ఈ సమాజాల్లో ఆదిలో మాతృస్వామిక వ్యవస్థలుండేవి. మాతృస్వామిక వ్యవస్థల్లో మహిళలదే కుటుంబాధిపత్యం. అందుకే ఇక్కడ దేవుళ్లూ, దేవతలు ప్రధానంగా మహిళలే. అమ్మవార్లు, దుర్గామాత ఆ సాంప్రదాయం నుండి వచ్చినవారే. ఇక్కడ చెడుపై విజయం సాధించింది కుటుంబానికి పెద్ద అయిన మహిళ. ఇంకో కథనం ప్రకారం దుర్గాదేవి, లేక అమ్మవార్లు ఆయా మాతృస్వామిక సమాజాల నాయకురాళ్లు కాగా మహిషాసురుడు దున్నపోతు. అంటే ఆనాటి కుటుంబ యజమాని అయిన మహిళ దున్నపోతును స్వాధీనం చేసుకుని


దాండియా

గార్బా సందడి

వ్యవసాయానికి ఉపయోగించడంలో కీలకపాత్ర వహించిందన్న మాట. పశువులను లొంగదీసుకుని వ్యవసాయానికి ఉపయోగించుకోవడంలో అంటే పశు వులతో వ్యవసాయం చేయడం కనుగొనడంలో నాటి మానవుడు సాధించిన విజయానికి దక్షిణాది విజయదశమి ప్రతీక. దక్షిణాదిలో దున్నపోతు ప్రధానంగా వ్యవసాయంలో ఉపయోగపడుతుంది. గేదె పాలు వారు ప్రధానంగా వాడుతారు. కాని ఆర్యులకు ఆవులు, ఎడ్లు ప్రధానం. ఇక్కడ కూడా ఉత్తరాది ఆర్య సంస్కృతికీ, దక్షిణాది సంస్కృతికి ముఖ్యంగా శూద్ర కులాల సంస్కృతికీ మధ్య తేడా కనిపిస్తుంది. కాలక్రమంలో ఈ సంస్కృతులు చాలా వరకు కలిసిపోయినా నేటికీ పండుగలు, ఆచారాలు, వాటి చుట్టూ ఉండే కథల నుండి ఈ తేడాను మనం విశ్లేషించగలం. దసరా రోజుల్లోనే మన తెలుగువారు 'బతుకమ్మ' పండుగ జరుపుకుంటారు. ఈ పండుగ గురించి కూడా అనేక కథలు ఉన్నప్పటికీ ఇదీ ప్రధానంగా వ్యవసాయానికి సంబంధించిన పండుగే. భారతదేశంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో ఒరవడిలో ఈ పండగను జరుపుకుంటారు. ఆనాటి మాతృస్వామ్య వ్యవస్థలో మహిళలను దేవతలుగా పూజించేవారు. ఆ సాంప్రదాయమే నేటికీ కొనసాగుతోంది. అలాంటి వాటిలో దసరా ప్రత్యేకంగా మహిళా శక్తిని ఆరాధించే పండుగ. వాటిలో స్త్రీ పాత్ర కూడా ఎక్కువే. అయితే కేవలం పూజా కార్యక్రమాలు, సింధూర ఖేళీలకే పరిమితమవకుండా మహిళ మరో అడుగు ముందుకేసి ఇతర పండగలోను కీలకమైన విషయాల్లో ముందుంటోంది. వందల ఏళ్ళుగా పురుషులు మాత్రమే పురుషులకు మాత్రమే అనుకున్న రంగాల్లోను రాణించి దసరాకు కొత్త శోభను తెస్తున్నారు. వారి విజయాలతో విజయ దశమికి కొత్త వైభవం తెస్తున్నారు. ఇప్పటికే మహిళ తన ప్రత్యేకతను చాటుకున్న పండుగ సంబరాల్లోను రికార్డులు సృష్టిస్తున్నారు.

కుమార్తులి తల్లి

మహిళను ఆదిపరాశక్తిగా భావిస్తూ, పది చేతులూ, రౌద్రమైన ముఖమూ, ఒక చేతిలో కత్తి, మరో చేతిలో గద, ఇంకో చేతిలో విల్లు, ఇలా ఒక్కో చేతిలో ఒక్కో ఆయుధాన్ని పట్టుకుని రాక్షసుని తలను నరికి ఉన్నట్లుగా ఉండే ఆ పరాశక్తి ప్రతిరూపాన్ని చాలా కళాత్మకంగా తయారుచేస్తారు బెంగాల్‌కు చెందిన కుమార్తులి కళాకారులు. ఆ కళాకారుల ప్రతిభ ఆదిపరాశక్తి విగ్రహంలోని ప్రతి అణువులోనూ మనకు కనిపిస్తుంది. కళలకు లింగ బేధముందా? మరి వందల ఏళ్ల నాటి కుమార్తులి కళలో పురుషాధిపత్యమే కనిపిస్తుంది. మాత రూపాన్ని తీర్చిదిద్దే కళలో మహిళకు ప్రాధాన్యత లేకపోతే ఎలా? దీనికి సమాధానమే చయినా పాల్. కుమార్తులి కళను ఔపోసన పట్టిన ఈమె ప్రావీణ్యంలోనే కాదు ప్రత్యేకతలోను ఆ కళకు కొత్త రూపులు అద్దారు. స్త్రీ,పురుష బేధం లేకుండా తొలి దుర్గా మాత విగ్రహానికి తన చేతులతో ఊపిరిపోశారు. అంతకుముందు ఇలాంటి ఆలోచన చేసినవారు లేరు. తండ్రి నుంచి సహోదరులు అందిపుచ్చుకోవాల్సిన ఈ కళను వారు వదిలేయడంతో చయినా పాల్ తొలి మాతృకను చేతిలోకి తీసుకున్నారు. తండ్రి లోకమంతా కుమార్తులి కళే కావడంతో ఆయన వారసత్వాన్ని తాను నిలబెట్టి దుర్గా మాత నిండు రూపాన్ని తన చేతుల్లోకి తీసుకున్నారు. కుమార్తులి కళలో ఆమె సంచలనం. అతి తక్కువ కాలంలో ఆ కళలో ప్రావీణ్యత సంపాదించడమే కాదు పురుష కళాకారులకు దీటుగా విగ్రహాల్ని నిలబెట్టారు. ఇప్పుడు ఆమె స్ఫూర్తితో మరికొందరు మహిళలు కుమార్తులి కళలోకి ప్రవేశించారు. ప్రస్తుతం ఒక విగ్రహాన్ని కేవలం అయిదారుగురు మహిళలు కలిసి తయారు చేసేస్తారంటారు కుమార్తులి శిల్పి సమితి కార్యదర్శి రాణాంజిత్ సర్కార్. కోల్‌కతా బాణర్మాలి వీధిలో ఆది శక్తి విగ్రహాల మధ్య ఆమె తన పనిలో నిమగ్నమై కనిపిస్తారు. ఆమె దగ్గర పనిచేసే కళాకారులను కూడా ఎంతో ఆదరిస్తారామె. కళాకారులకు చాలీ చాలని జీతాలిచ్చేసి, మిగతాదంతా తన వద్దే ఉంచేసుకునే దుష్ట ఆలోచనలేవీ తనకు లేవు. కళాకారులంతా ఆమెకు సమానమే. ఆమె వద్ద ఎనిమిది మంది కళాకారులు పనిచేస్తుంటారు. వీరంతా కలిసి నవంబరు నెలలో పర్యటనలకు వెళ్తారు. నెలంతా కలిసి మెలిసి ఆటవిడుపుగా అలా యాత్రల్లో తిరుగుతారు. సాధారణంగా కుమార్తులి మహిళలు యింటికే పరిమితమౌతారు. మగాడిచాటు భార్యలుగా ఉంటారు. అలాంటి వాతావరణంలో చయినా పుట్టి పెరిగారు. ఇంటికే పరిమితమవ్వకుండా ఇంటి బాధ్యతలను తన నెత్తిన వేసుకుని మరీ కళా ప్రతిభతో ఊరికే గొప్ప గుర్తింపును తెచ్చిపెట్టారు. తన పేరు చయినా అంటే బెంగాల్లో నాకేమి వద్దని అర్థం.

గతేడాది ఆమె దుర్గామాత విగ్రహాన్ని అర్ధనారీశ్వరి ఆకారంలో తయారు చేశారు. దేశంలో అలాంటి విగ్రహం అదే మొదటిసారి. ఈ విగ్రహాన్ని తయారు చేయడంలో ఆమె చూపించిన తెగువను, ధైర్యాన్ని సామాజిక మాధ్యమాలు కీర్తించాయి. కానీ, స్థానికులు దాన్ని ఖండించారు. విమర్శించారు కూడా. వాటిని ఆమె చెవిన పెట్టలేదు. ఎందుకంటే కళకు, ఆరాధనకు లింగ భేదం లేదనేది ఆమె మాట. దుర్గామాత రూపాన్ని కలపతోను వినూత్నంగా రూపొందించారు చయినా పాల్.

బతుకమ్మ బొమ్మ



దాండియా వనితలు

'కుమార్తులి' కళాకారిణి చయినాపాల్

పులికేళిలో వినయ

బతుకమ్మ

తెలంగాణ సాంస్కృతిక ప్రతీక, తెలంగాణ ప్రజలకు ప్రత్యేక పండుగ బతుకమ్మ. త్రికోణాకారంలో రంగురంగుల పూలను పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయాకారంలో తిరుగుతూ పాటలు పాడతారు మహిళలు. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ బతుకమ్మలను బావిలో లేదా నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ బతుకమ్మ అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, అప్యాయతలు, భక్తి, భయం, చరిత్ర, పురాణాలు ఇలా అనేక అంశాలు మేళవిస్తారు. తెలంగాణ గడ్డపై ఈ పండుగను కొన్ని దశాబ్దాలుగా జరుపుకుంటున్నారు. ఈ సంప్రదాయం ఎలా మొదలైందో చెప్పడానికి అనేక కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. అయితే. తెలంగాణా గ్రామీణ సమాజంలో నవాబులు, భూస్వాముల పెత్తందారీతనంలో నలిగిపోయిన మహిళల బతుకులు మరింత దయనీయంగా, దుర్భరంగా ఉండేవి. వారి రాక్షస వికృత విన్యాసాలను తట్టుకోలేక కొంతమంది మహిళలు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. వారిని తలుచుకుని తోటి మహిళలు విచారించేవారు. వారికి ప్రతీకగా పూలను పేర్చి బతుకమ్మా అంటూ దీవిస్తూ పాటలు పాడేవారు. వాస్తవానికి ఆ పాటల వెనుక ఉండే మర్మం అదే. ఈ పండుగ వర్షాకాలపు చివరిలో, శీతాకాలపు తొలిరోజుల్లో వస్తుంది. అనేక రంగుల పూలను తెచ్చి, రోజుకొక్క రకం పూలను అలంకరించి బతుకమ్మ సంబరాలు చేసుకుంటారు.

విజయవాడ దుర్గగుడిలో కోలటం

పులి డాన్సులో మహిళలు

కేరళలో దసరా, ఓనమ్ వంటి పెద్ద పండుగల్లో పులి ఆహార్యం, రంగులు ఒంటికి పూసుకుని ఉత్సవాల్లో పులి వేషాల్ని మగవారు కట్టడం 200 ఏళ్లుగా చూస్తున్నదే. దీన్ని పులికాళి లేదా కడువ కాళి అని పిలుస్తారు. ఇందులో పిల్లి, ఎలుక నాట్య సన్నివేశం అతి ముఖ్యమైన అంశం. గంటల పాటు మైళ్లకు మైళ్లు అలసి పోకుండా అతి గంభీరంగా రోమాలు నిక్కబొడుచుకునేలా వీరి నృత్యకేళి ఉంటుంది. దీనికి అసాధారణ శక్తి కావాలి. ఇలాంటి పులికాళి నృత్యకేళిలో తొలిసారిగా ముగ్గురు మహిళలు ఆడ పులులుగా విజృంభించారు. అలుపన్నది లేకుండా ఎంతో ఉత్సాహంగా వారేసిన పులి నాట్యం చూసి అందరూ విస్తుపోయారు. రెండొందల ఏళ్లలో జానపద కళా నృత్య చరిత్రలో ఇదొక అరుదైన సంఘటన. అప్పటివరకు మగవారిదే పులి డ్యాన్సు అన్న ముద్రను వీరు తొలగించే యత్నం చేశారు. మహిళా కళాకారుల్లో ఒకరైన వినయ పోలీస్ అకాడెమీ ఉద్యోగిని. ఆమె మహిళాభ్యున్నతి కోసం 'వింగ్స్' అనే వేదికను ఏర్పాటు చేశారు. ఈ వేదిక ద్వారానే మిగతా పులి డ్యాన్స్ కళాకారిణులు ఆసక్తి చూపించారు. స్థానిక పులికాళి నిర్వాహకుల్ని తమ ప్రతిభతో మెప్పించి ఎట్టకేలకు రంగ ప్రవేశం చేశారు. వాస్తవానికి పులికాళి కార్యక్రమంలో మహిళలు పాల్గొనడానికి ఎటువంటి అభ్యంతరాలు లేవు. కానీ ముందుకు వచ్చిన వాళ్లు అరుదు. రెండు శతాబ్దాల క్రితం కొచ్చిన్ మహారాజా రామ వర్మ శాంతాన్ తాంపురాన్ ఆధ్వర్యంలో ఈ పులికాళిని ఆదరించారనేది చరిత్ర. మొదటసారిగా వడక్కునాథం ఆలయం వద్ద ప్రతి ఏటా నిర్వహించే ఉత్సవాలలో పులికాళి నృత్యాన్ని ఆరంభించారు. ఈ జానపద నృత్యంలో ధైర్య సాహసాలతో పోరాడే ప్రతిభ సామర్థ్యం కేరళలోని పాలఘాట్ ప్రాంతంలో చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంది.

ఈ ఉత్సవాల్లో కళాకారులు ఊరేగింపులో తమ కళను ప్రదర్శించడానికి కొన్ని గంటల ముందు నుంచే వారు మేకప్‌ని ప్రారంభిస్తారు. ఇది చాలా కీలకం. సుదీర్ఘంగా కొనసాగే ప్రక్రియ. ఈ ప్రదర్శనలో మానవుడు, మృగానికి మధ్య ఉన్న సంబంధాన్ని చాలా చక్కగా వివరిస్తారు.

రామ్‌లీలలో అడుగు

భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో వివిధ రకాల సంప్రదాయాలతో దసరాని జరుపుకుంటారు. ఉత్తర భారతదేశంలో దసరా ఉత్సవాల్లో రామ్‌లీల ఒక సమగ్ర సాంప్రదాయం. చెడుపై మంచి చేసిన విజయంగా దీన్ని చెప్పుకుంటారు. ఇది తులసీ దాస్ రాసిన రామచరిత మానస్ నుంచి సంగ్రహించబడిన కథను అనుసరించి నాటకాలు వేస్తారు. భారీ ఎత్తులో ఉండే రావణుని దిష్టిబొమ్మను దగ్ధం చేస్తారు. సాధారణంగా ఇక్కడి కార్యక్రమాల్లో పురుషులదే హవా. కానీ కొన్నేళ్లుగా మహిళల ప్రాధాన్యత కూడా పెరుగుతోంది. ఆ మార్పును సీతా స్వయంవరం ఘట్టాల వేదికల్లో బాగా ఉపయోగిస్తున్నారు. ఎర్రకోట వద్ద జరిపే వేడుకల్లో

గిన్నిస్‌కెక్కిన కుట్లానాటి

మహిళా భద్రత, ఆడ పిల్ల ప్రాధాన్యత తదితర అంశాలపై పలు కార్యక్రమాల్ని రూపొందిస్తున్నారు. ఒకప్పుడు ఇక్కడ జరిగే నాటకాల్లో స్త్రీ పాత్రల్ని మగవారే ధరించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితిలో మార్పు వస్తోంది. బాలీవుడ్ హీరోయిన్ హేమామాలినీ లాంటి అగ్రతారలు కూడా సీత పాత్రల్ని ధరించి మరింత శోభ తీసుకువస్తున్నారు. కళాకారులుగానే కాదు నిర్వాహక బాధ్యతల్ని నిర్వహిస్తున్నారు.

చెండే నృత్యం

కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో విస్తృతంగా ఉన్న నృత్యం చెండే నాట్యం. దసరా ఉత్సవాల్లో ఈ నృత్యంలో మహిళలే పాల్గొనడం విశేషం. చెండే అనగా ఒక స్థూపాకార చెక్క డ్రమ్. ఇది రెండు అడుగుల పొడవు, ఒక అడుగు వ్యాసం కలిగి, రెండు చివర్లలో జంతువు యొక్క చర్మాన్ని అమర్చి ఉంచుతారు. దీన్ని మెడలో వేలాడదీసుకుని, కొట్టినపుడు ఈ పరికరం బిగ్గరగా, దృఢమైన ధ్వనితో మోగుతుంది. కేరళలో అంతర్భాగంగా ఉన్న ఈ చెండే నృత్యం పండుగలకు, ఫంక్షన్‌లకు ప్రతీతిగా నిలుస్తుంది. ఇప్పటి వరకు మగాళ్ల ఆధిపత్యంలో ఉన్న ఈ చెండే నృత్యంలో ఇపుడు మహిళలు కూడా భాగస్వాములవుతున్నారు. కేరళ సాంస్కృతిక సాంప్రదాయ వాయిద్యం లయకు అనుగుణంగా డాన్స్ ప్రదర్శన చేస్తారు. కథాకళి, కూడియట్టం, కాళి వంటి నృత్యాలు ఈ వాయిద్య సహకారంతోనే ప్రసిద్ధిగాంచినవి. మైసూరు దసరా ప్రచారం కోసం అక్కడ ప్రభుత్వం మహిళా చెండే కళాకారులతో ప్రచారం చేయించారు.

మైసూర్‌లో దసరా ఉత్సవాల్లో మహిళలకు ప్రత్యేకమైన మహిళా దసరా వేడుకలు రెండు రోజుల పాటు అట్టహాసంగా జరుగుతాయి. బొమ్మల కొలువుల దగ్గర నుంచి మల్ల యుద్ధ పోటీల వరకు ప్రతి అంశంలోను వారి ప్రతిభను చాటేందుకు ఈ ఉత్సవాలు వేదికలవుతాయి. మహిళలు మల్ల యుద్ధ పోటీల్లో పాల్గొనడం ఈ మధ్య వచ్చిన ఒరవడి కాదు. మైసూరుతో పాటు విజయనగర పాలకుల కాలం నుంచే దసరా ఉత్సవాల్లో మహిళల యుద్ధ కళా నైపుణ్యాలను కళ్లకు కట్టేందుకు ఉత్సవాల్లో కార్యక్రమాలు ఉండేవి. ప్రత్యేక రహస్య దళాలుగా అప్పట్లో సేవలందించిన వారు దసరా ఉత్సవాలపుడు తమ ప్రతిభను ప్రదర్శించేవారు. ఇప్పుడు కేవలం మైసూరే కాకుండా పలు రాష్ట్రాల క్రీడాకారిణులకు కూడా పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నారు. అదే కాదు చిత్రలేఖనం వంటి ఇతర కళా నైపుణ్యాల్లోను మహిళలకు ప్రత్యేక అవకాశాన్ని కల్పిస్తాయి మైసూర్ దసరా వేడుకలు.

కుల్లూ నారుల రికార్డు

హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రాంతాల వారీగా వివిధ నృత్య రూపాలున్నాయి. అందులో ప్రముఖమైంది కుల్లూనాటి నృత్యం. కులుమనాలిలో దసరా ఉత్సవాల్లో కుల్లూనాటి నృత్యం అత్యంత ప్రాముఖ్యమైంది. ఇది ప్రత్యేకంగా మహిళా కళాకారిణులది. ఎర్రని కుల్లూవి వస్త్రాలను ధరించి నర్తించే ఈ జానపద నాట్యం కట్టిపడేస్తుంది. ఈ నాట్యాన్ని మహిళా సాధికారత సందేశాలకు ఉపయోగించడమే ఇప్పుడు కొత్త ఒరవడి. ఇలా గతేడాది దసరా వేడుకల్లో భాగంగా 'భేటీ హై అన్మోల్' (ఆడపిల్లే అత్యంత విలువైనది) అనే సందేశాన్నిస్తూ అక్టోబరు 26న 9,892 మంది మహిళా డ్యాన్సర్లు కుల్లూవి దుస్తులు ధరించి చారిత్రాత్మక ధాళపూర్ గ్రౌండ్‌లో కులునాటి నృత్యం ప్రదర్శించారు. అత్యంత ఎక్కువ మంది పాల్గొన్న అతిపెద్ద జానపద ప్రదర్శనగా గిన్నిస్ ప్రపంచ రికార్డుల్లోకి ఎక్కింది. హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ హయాంలో కులు జిల్లా పరిపాలనా యంత్రాంగం ఈ అవార్డును సొంతం చేసుకుంది. వారం రోజుల పాటు సాగే దసరా ఉత్సవాల్లో ఈ నృత్యం అందరికి ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. కులు-మనాలి సాంస్కృతిక వారసత్వానికి ఇదొక మంచి పరిణామం. ఈసారి కుల్లూనాటి నృత్యంలో 'సేవ్ ది గర్ల్' (ఆడపిల్లను కాపాడండి) అనే సందేశమిస్తూ ప్రదర్శన ఏర్పాటు చేశారు. సామాజిక రుగ్మతను రూపుమాపే దిశగా ఈ నృత్యంలో మంచి సందేశాన్నిచ్చారు. గతేడాదే కాదు అంతకన్నా ముందు అక్టోబరు 7, 2014లో 8,540 మంది మహిళలతో చేసిన నృత్యం లిమ్కా వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకుంది.

ఇలా మహిళలకే ప్రత్యేకమైన దసరా కార్యక్రమాల్లోనే కాక కొత్త కళల్లో, రంగాల్లో వారు సత్తా చాటుతూ స్త్రీ శక్తి పండుగను మరింత శోభాయమానం చేస్తున్నారు. విజయదశమిలోని ఈ సరికొత్త మార్పు మిగతా రంగాల్లోను మరింత విస్తృతమై మహిళా శక్తికి ప్రతీకగా దసరా ఉత్సవాలు జరగాలని కోరుకుందాం.

✦

దాండియా, గార్బా, కోలాటం

మన తెలుగు నాట కోలాటాల కోలాహలం ఎలా కనిపిస్తుందో గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో దాండియా, గార్బాల నృత్యకేళీ పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహంతో నింపేస్తుంది. పురుషులు కూడా పాల్గొన్నా మహిళలకే ప్రాధాన్యత ఎక్కువ. విజయవాడ, శ్రీశైలం దసరా ఉత్సవాల్లో పసుపు వస్త్రాలు ధరించి కోలాటాలాడే మహిళా కళాకారిణుల బృందాలుంటాయి. అలాగే దాండియా, గార్బాల్లో కూడా ఇలాంటి బృందాలు కనిపిస్తాయి. దాండియా నృత్యం దుర్గ మాత గౌరవార్థం ప్రదర్శించేదిగా ఉంది. దుర్గాదేవి శక్తి స్వరూపమైన మహిషాసురునికి, భూతం రాజుకు మధ్య జరిగిన పోరాటంగా ఈ దాండియా నృత్యాన్ని ప్రదర్శిస్తారు. దీన్ని మరొక విధంగా చెప్పాలంటే ఖడ్గనృత్యం అంటారు. నృత్యంలోని కర్రలు దుర్గాదేవి ఖడ్గాన్ని సూచిస్తాయి. ఈ దాండియాలో మహిళలు రంగుల చేనేత సాంప్రదాయ దుస్తులు, పరికిణీ, బందాని సాంప్రదాయ దుస్తులను ధరిస్తారు.

అభ్యుదయవాదులు మార్పు తేవాలి

పండుగలు, ఉత్సవాలను మూఢనమ్మకాల పేరుతో మొత్తంగా కొట్టి పారేయకూడదు. అదే సమయంలో వాటిలోని అన్ని అంశాలనూ అంటే మూఢవిశ్వాసాలు, మూఢాచారాలు, ఆధ్యాత్మిక విషయాలను కూడా భుజాన వేసుకుని మోయకూడదు. ప్రజాసంస్కృతిని మతతత్వ, అభివృద్ధి నిరోధక శక్తుల నుండి, కార్పొరేట్ వినిమయ విష సంస్కృతి నుండి రక్షించాలనుకునేవారికి, అభ్యుదయ ప్రజా సాంస్కృతికోద్యమాన్ని నిర్మించాలనుకునే వారికి పండుగలు అత్యుత్తమమైన సందర్భాలు. అందువల్ల అభ్యుదయ వాదులు వాటికి దూరంగా ఉండకూడదు. పాల్గొనాలి, ప్రభావితం చేయాలి, ప్రజాసంస్కృతిని రక్షించాలి.

మృతుల పట్టణం



కాలిఫోర్నియాలోని కోల్మాలో 1700 మంది జనాభా ఉంటారు. ఇది మామూలే కదా అంటే వీరికి తోడుగా 15 లక్షల సమాధులుంటాయి. ఇదే ప్రత్యేకం. శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన వారివే ఈ సమాధులు. 1900కే శాన్‌ఫ్రాన్సిస్కో సమాధులతో నిండిపోయింది. గోల్డ్ రష్ కారణంగా బంగారు గని కార్మికులు, వర్తకులు, వలసదార్లు ఇలా లక్షల మంది ఈ నగరానికి పోటెత్తారు. చనిపోయిన వారిని ఇక్కడి 27 శ్మశానాల్లో సమాధి చేసేవారు. అవి నిండిపోవడంతో దగ్గరలోని కోల్మాకు తరలించారు. బంగాళా దుంపల్ని పండించే ఆ ప్రాంతంలో విశాలమైన 17 సమాధి స్థలాలు ఏర్పాటయ్యాయి. వీటిని స్థానికులు పార్కులంటారు. రోజుకు 75 భౌతిక కాయాల్ని ఇక్కడ ఖననం చేస్తారు. ఇంత పెద్ద ఎత్తున సమాధులుండటం వల్లే ఈ ఊరిని 'ది సిటీ ఆఫ్ ది డెడ్', 'ది సిటీ ఆఫ్ ది సైలెంట్' అని పిలుస్తారు. మిగతా ప్రాంతాలకు చెందిన వాళ్లు ఈ ఊరిని వింతగా చూస్తుంటే స్థానికులు మాత్రం అలా ప్రత్యేకంగా తమ ఊరు నిలవడం గర్వంగా ఉందని చెబుతుంటారు. వారి ఊరి కోసం ఓ నినాదాన్ని కూడా ఎత్తుకున్నారు. అదేంటంటే 'ఇట్స్ గుడ్ టు బి అలైవ్ ఇన్ కోల్మా' (కోల్మాలో బతికి ఉండటం మంచిది) అని. ఈ ఊరి పలువురు ప్రపంచ ప్రముఖులు కూడా ఉన్నారు. వారిలో డెనిమ్ జీన్స్ వ్యాపారవేత్త లెవీ స్ట్రాస్ ఒకరు. అదేనండి జీన్స్ ప్యాంట్లపై లెవీస్ అని ఉంటుందే అది ఇతగాడి బ్రాండే.

వింత లోకం

కలల కళకు..

కలల్లో నిద్ర లేచి వాస్తవానికి సంబంధం లేకుండా ఊహ లోకంలో పచార్లు చేయాలనుకునేవారికి 'లూసిడ్ డ్రీమర్' అనే బుల్లి పరికరం వచ్చేసింది. ర్యాపిడ్ ఐ మూమెంట్ (రెమ్) నిద్రను పసిగట్టే డిటెక్టర్ అందులో ఉంటుంది. ఆ సమయంలో చిన్న స్థాయి విద్యుత్‌ను మెదడుకు పంపించి మనం కలలో ఉన్నామనే విషయాన్ని తెలుసుకునేలా చేస్తుందట. అలా కలలపై నియంత్రణ మనకే వదిలేస్తుందట. గామ్మా యాక్టివిటీ వల్ల మనలో 20 శాతం మంది స్పష్టంగా కలగంటున్నామనే విషయం తెలిసి మరీ కలలు కంటుంటారట. దీనికి లూసిడ్ డ్రీమ్ అని పేరు. ఈ తరహా కలలు లూసిడ్ డ్రీమర్ ద్వారా ప్రతి వ్యక్తిలో కూడా 77 శాతం వరకు కనొచ్చని అంటున్నారు స్వీడెన్‌కు చెందిన దీని రూపకర్తలు. ప్రస్తుతానికి ప్రయోగాత్మకంగా దీని పనితీరును పరిశీలించారు. త్వరలో మార్కెట్‌లోకి తేవాలనేది న్యూరోమాడ్యులేషన్స్ టెక్నాలజీస్ బి.వి. సంస్థ ప్రయత్నిస్తోంది. సాధారణంగా కలల్ని నియంత్రించగలిగేందుకు రకరకాల పద్ధతులున్నా కూడా ఆ కళలో నైపుణ్యం సాధించడానికి నెలలు, ఏళ్లు సమయం పడుతుందనీ ఈ పరికరం ద్వారా తేలికగా ఇష్టమైన కలలు కనేయొచ్చనీ చెబుతోంది.

మెలనిన్ దేవత

అసూయ పడేంత నల్లగా ఉంటుంది సెనెగల్‌కు చెందిన కౌడియా డియోప్. ఆ శరీర ఛాయే ఆమెనో సెలెబ్రిటీ చేసేసింది. మోడల్‌గా అవకాశాల మీద అవకాశాలు వచ్చి ఆమె గురించి తెగ ప్రచారం జరిగిపోతోంది. మెలనిన్ అధికంగా ఉన్న ఈమెను 'మెలనిన్ గాడెస్' అని పిలుస్తోంది లోకం. ఈ అంతర్జాతీయ స్టార్‌ను చూసి చాలామంది నల్ల జాతీయుల్లో మార్పు కూడా వస్తోందట. ఇన్నాళ్లు తెల్లబడాలనే ఆలోచనతో రకరకాల క్రీములు, చికిత్సలు చేయించుకున్నవాళ్లంతా ఇప్పుడు మరింత నల్లబడాలని చూస్తున్నారట. అంత నల్లగా ఉన్నందుకు కౌడియా చిన్నతనంలో ఎన్నో వెక్కిరింతలను ఎదుర్కొంది. కానీ ఇప్పుడు మాత్రం అదే రంగు వల్ల దేవతలా ఆరాధించబడుతోంది. చాలా ఆఫ్రికా దేశాల్లో స్కిన్ బ్లీచింగ్ అనేదో పెద్ద సమస్యగా మారింది. కోట్లాది మంది అమ్మాయిలు వైటెనింగ్ క్రీములు వాడి తెల్లబడాలని ప్రయత్నిస్తున్నారు. ఇదంతా కూడా యూరప్ దేశాలు అందానికిచ్చిన నిర్వచనం, ప్రచారం వల్లేనని అసలు అందమనేది సహజాత్మకంగా ఉండేదేనని అక్కడి డెర్మటాలజిస్టులు అంటున్నారు. నైజీరియా, టోగో, దక్షిణాఫ్రికా వంటి దేశాల్లో నల్ల జాతీయులకు ఈ పిచ్చి మరీ ఎక్కువగా ఉంది. వీరికి కౌడియా గురించి చెప్పి మార్పు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న అభిమానుల సంఖ్య కూడా మెలనిన్ గాడెస్ క్రేజ్‌ను మరింత పెంచుతోంది.





ఓ సృజన యాత్ర

నేడు యువత చదువు, కెరీర్, లైఫ్‌స్టైల్, ఫ్యాషన్ అంటూ జీవితంలో పరుగులు తీస్తుంటే, రాహుల్ కారన్‌పూరియా భారత్‌లోని సృజనకారులని వెతికి పట్టుకునే ఓ యాత్ర మొదలెట్టాడు. 52 వారాల పాటు కొనసాగించాలనుకున్న ఆ యాత్ర పేరే '52 పరిందే'. రెక్కలొచ్చిన పక్షిని ఎగరకుండా ఆపలేమనేది ఎంత నిజమో సృజనకి అవధులు లేవనేది అంతే నిజం.

అందరిలా ఉపాధి అవకాశాల కోసం సమయాన్ని వృథా చేయకుండా సృజనతో అవకాశాల్ని అందిపుచ్చుకుని పర్యావరణహితానికి కృషిచేస్తున్నారు కొందరు. ఈ అసామాన్యుల జీవితాలు నేటి యువతకు ప్రేరణనిస్తూ, బతుకు పాఠాలని నేర్పుతున్నాయి. ప్రకృతి అందాలకు ఆనవాలుగా ఉండే ఉదయ్‌పూర్ చిత్తోడ్‌గఢ్ ప్రాంతానికి చెందిన రాహుల్ కరణ్‌పురియ చిన్నతనం నుండే యాత్రలంటే ఇష్టాన్ని పెంచుకున్నాడు. కుటుంబ సభ్యులతో కలిసి వివిధ ప్రాంతాలకి చక్కర్లు కొట్టేవాడు. ప్రయాణాలపై తనకున్న ఇష్టంతో పాటు ప్రతి పనినీ వైవిధ్యంగా చేయాలనేది రాహుల్ కోరిక. ఎంబిఎ చదువుతున్న రోజుల్లో ఈ ఆలోచన మరింత బలపడింది. ఒకే ప్రదేశంలో ఉంటూ అందరిలాగే చదువు, ఉద్యోగం అంటూ పరుగులు తీయడం తనకి సరిపడదనిపించింది. చదువుతున్న ఎంబిఎని విడిచిపెట్టి సృజనకు పదును పెట్టే ఆలోచనల కోసం యాత్ర చేయాలనుకున్నాడు. అదే '52 పరిందే'. డిజిటల్ ఎంపవర్‌మెంట్ ఫౌండేషన్ ఆర్థిక సాయంతో చేపట్టిన ఈ యాత్రకి క్రియేటివ్ కామన్స్ లైసెన్స్‌ని పొందాడు రాహుల్. పరిందే అంటే పక్షి అని అర్థం. పక్షిలా రెక్కలు కట్టుకుని నచ్చిన ప్రదేశంలో వాలిపోవాలనేది తన ఆలోచన. పక్షి స్వేచ్ఛకి చిహ్నం. ప్రస్తుతం ఎంతో మంది యువత అందరికంటే వైవిధ్యంగా ఎన్నో చేయాలనుకుంటారు. కానీ యాంత్రిక జీవనంతో సతమవుతున్న వారికి ఆలోచనలు సరైన మార్గాన్ని చూపించలేకపోతున్నాయి. అలాంటి యువతకి కొత్త ఆలోచనల్ని అందించేందుకు ఈ సృజన యాత్రని ప్రారంభించాడు రాహుల్.



ఒక్కొక్కరిదీ ఒక్కో ప్రభావం

పర్యావరణ హితాన్ని కలిగించే వృత్తులనే ఉపాధిగా ఎంచుకున్న 52 మంది సృజనకారుల జీవితాలని వెలికితీసేందుకు గత సంవత్సరం నవంబర్‌లో తను చేపట్టిన యాత్ర ఇప్పటికే 30 మంది పర్యావరణ హితులని అందించింది. యాత్రలో భాగంగా ఉదయ్‌పూర్‌లో తను కలుసుకున్న మొట్టమొదటి వ్యక్తి రోహిత్‌జైన్. గుజరాత్ రాజస్థాన్ ప్రాంతాల్లోని గిరిజనులతో నివసిస్తూ వారి నుండి సాంప్రదాయ వ్యవసాయ పద్ధతుల్ని నేర్చుకున్నాడు ఐటి గ్రాడ్యుయేట్ రోహిత్. ఉదయ్‌పూర్ పరిసరాలని కాలుష్యరహితంగా మార్చేందుకు కృషిచేస్తున్న రోహిత్ ఆ ప్రాంతంలో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించే పనిలో పడ్డాడు. కర్ణాటకలోని హొనవర్‌లో రాహుల్‌కి పరిచయమయ్యారు శాంతి నాయక్. గ్రామీణ సాంప్రదాయాల్ని వివిధ జానపద కళారూపాల్లో సేకరిస్తూ వాటిని పరిరక్షించేందుకు 50 సంవత్సరాలుగా తన కుటుంబంతో కలిసి కృషిచేస్తున్నారు నాయక్. మహారాష్ట్ర చిల్పున్ ప్రాంతానికి చెందిన వ్యక్తి మల్హార్ ఇన్దుల్‌కర్. చిల్పున్‌లోని వశిష్టా నదిపై ఆధారపడి జీవించే మత్స్యకారులతో పాటు అక్కడి సముద్ర జీవాల్ని చిన్ననాటి నుంచి పరిశీలిస్తుండేవాడు మల్హార్. నది కలుషితమవుతుండడంతో వాటిపై ఆధారపడి జీవిస్తున్న జీవజాలానికి నష్టం ఏర్పడింది. వశిష్టా నదిని కాపాడేందుకు కృషిచేస్తున్నాడు మల్హార్. ముంబయ్ యాత్రలో భాగంగా రాహుల్‌కి పరిచయమైన మరో వ్యక్తి దినేష్. కొన్నేళ్ల క్రితం ముంబయ్ అండర్‌వరల్డ్‌కి మత్తు పదార్థాలు, ఆయుధాలని అందించిన దినేష్ గుర్జర్(60) ఇప్పుడు అవి మానేసి వ్యవసాయం చేస్తూతెలివైన రైతుగా గుర్తింపు తెచ్చుకున్నాడు. సేంద్రీయ పద్ధతుల్లో తను కనుకొన్న కొన్ని వ్యవసాయ పద్ధతుల్ని గ్రామంలోని ఇతర రైతులకి నేర్పుతూ ఆదర్శ జీవితాన్ని గడుపుతున్నాడు గుర్జర్. రొటీన్ జీవితాలతో విసిగిపోయి ఆనందానికి దూరమవుతున్న వారు కొందరైతే, ఉపాధి అవకాశాలు లేవంటూ ఆత్మహత్యలు చేసుకుంటున్న యువత మరికొందరు. రాహుల్ యాత్రలో పరిచయమైన వారందరూ సృజనతో గుర్తింపు తెచ్చుకున్న వారే. సొంత ఆలోచనలకి పదును పెడుతూ పర్యావరణ పరిరక్షణకి కృషిచేస్తున్న వీరి జీవితాలు మనందరికీ స్ఫూర్తినిస్తాయి.

విలి

రెస్టారెంట్లకు, కేఫ్‌లకు వెళ్ళేది కేవలం తిన
ముఖ్యంగా అక్కడ పొందే అనుభవం కోసం
అధికమౌతున్నారు. అందుకే ఈ మధ్యకాలం
వినూత్నంగా ఏర్పడుతున్నాయి. ఇదే క్ర
ముందుకొస్తున్నాయి. అలా భారతదేశంలో

షిరోస్ హ్యాంగౌట్ కేఫ్

ప్రపంచ ప్రఖ్యాత టూరిస్ట్ ప్రాంతం ఆగ్రాలో ఉన్న ఈ కేఫ్‌ను యాసిడ్ దాడికి గురైన మహిళా బాధితులు నడుపుతున్నారు. ఇక్కడ పనిచేసేవాళ్ళ శరీరంపై ఎన్ని మచ్చలున్నా మనోధైర్యమనే సౌందర్యమే వాళ్ళేసే ప్రతి అడుగులో కన్పిస్తుంటుంది. ఇలాంటి వారి సాధికారత కోసమే షీరోస్ రూపొందింది. అంతేకాక ఇక్కడ సామాజిక అంశాలపై వర్క్‌షాప్‌లు నిర్వహిస్తారు. కమ్యూనిటీ రేడియో నడుపుతారు. యాసిడ్ బాధితులు తయారుచేసిన వస్తువులు ప్రదర్శనకు పెడతారు. 2014లో ప్రారంభించిన ఈ కేఫ్ తాజ్‌మహల్‌కు సమీపాన ఉంటుంది. ఇక్కడ సేదతీరేవారు వారికి ఇష్టమైనన్ని డబ్బులు చెల్లిస్తే సరిపోతుంది. ఉచిత వైఫై, లైబ్రరీ సదుపాయంతో పాటు ఆ మహిళల జీవిత కథలు కూడా ఎంతో అనుభవాన్ని పంచుతాయి. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి యాసిడ్ దాడి బాధితులచే నడపబడుచున్న చైన్ కేఫ్. లక్నో, ఉదయ్‌పూర్‌లో కూడా వీటి అవుట్‌లెట్స్ ఉండటం గమనార్హం.



కున్‌జుమ్ ట్రావెల్ కేఫ్:

దూరప్రయాణాలు చేసే యాత్రికులను ఉద్దేశించి ఏర్పాటు చేసిందే కున్‌జుమ్ ట్రావెల్ కేఫ్. దక్షిణ ఢిల్లీలోని హౌజ్ ఖాస్ గ్రామంలో ఉన్న ఈ కేఫ్ ప్రయాణాలు చేయడంలో ఉండే రుచిని, ఉత్తేజాన్ని తెలియజేస్తుంది. ఈ కేఫ్‌లోని గోడలపై ఉన్న చిత్రాలను చూసినవారు వెంటనే బ్యాగ్ సర్దుకుని ప్రయాణానికి సిద్ధపడతారంటే అతిశయోక్తి కాదు. 2010లో ప్రారంభించిన ఈ కేఫ్‌లో సుదూర ప్రయాణాలు చేసే యాత్రికులు పరిచయమౌతారు. ప్రత్యక్షంగానే కాక సోషల్ మీడియా ద్వారా కూడా చాలామంది యాత్రికులని పరిచయం చేసుకోవచ్చు. యాత్రలకు సంబంధించిన పుస్తకాలు, లైవ్ మ్యూజిక్, ట్రావెలింగ్ లెక్చర్స్‌తో ఎప్పుడూ సందడిగా ఉండే ఈ కేఫ్‌లో కూడా ఎవరికిష్టమైనంత వారు చెల్లించవచ్చు.

సేవా కేఫ్

బెంగళూరులో ఉండే ఈ రెస్టారెంట్‌లో సేవలందించే వ్యక్తులు స్వచ్ఛందంగా వచ్చి పనిచేస్తారు. అంతేకాక ఇది 'పే ఫార్వార్డ్' ఆధారంగా నడుస్తుంది. ఇక్కడ మెనూ కార్డులో ధరలు కనిపించవు. రూ.0 చూపించే బిల్లుపైన

కెఫే టోటో

అణగారిన నేపథ్యం నుంచి వచ్చిన వ్యక్తులు మాత్రమే పనిచేసే చోటు ఈ ఫ్రెంచ్ రెస్టారెంట్. కోల్‌కతాలో ఉన్న టోటోకు కోల్‌కతా ఫ్రెంచ్ కాన్స్యులేట్ సహకారం అందిస్తోంది. టుమారోస్ ఫౌండేషన్ ఎన్‌జిఓ, లైఫ్ ప్రాజెక్ట్ 4యూత్ అనే ఫ్రెంచ్ ఎన్‌జిఓ కలిసి ఈ రెస్టారెంట్‌ను నడుపుతున్నాయి. యూరప్ ఫుడ్‌ను అందించే ఈ టోటో కేఫ్‌లో పనిచేసేవారికి ఇది ఒక పాఠశాల. 18 నుంచి 24 సంవత్సరాల వయస్సు ఉన్నవారికి, వారానికి ఐదు రోజులు, మూడు భాగాలుగా విభజించిన యేడాది కోర్స్ నేర్పుతారు. వంటతో పాటు ఇంగ్లీష్, ఐటి నైపుణ్యాలు, కమ్యూనికేషన్స్, వ్యక్తిగత నైపుణ్యాలు, సూక్ష్మ ఆర్థిక కార్యకలాపాలు నేర్చుకునే అవకాశం ఉంటుంది. భోజన ప్రియుల కోసం దీన్ని వారానికి రెండు లేక మూడు రోజులు, మధ్యాహ్నం మాత్రమే తెరుస్తారు. హోం డెలివరీ సేవలను అందిస్తారు.

...దులు... వింతలు

...నికే అనుకుంటే పొరపాటే. అక్కడ వాతావరణం, సర్వింగ్ చేసే పద్ధతి.. మరీ ...ళ్ళేవారే ఎక్కువగా ఉంటారు. ఎందుకంటే వైవిధ్యాన్ని కోరుకునేవారు రోజురోజుకూ ...లో చాలా రెస్టారెంట్లు భోజన ప్రియులను ఆకర్షించడానికి సరికొత్త ఆలోచనలతో ...ంలో కొన్ని సామాజిక స్పృహను కల్గిస్తుంటే, మరికొన్ని క్రేజీ ఆలోచనతో ...ర్తింపు పొందిన కొన్ని రెస్టారెంట్లను చూద్దాం.

- ప్రవీణ్ వెలువోలు

'మీరు తిన్న భోజనం, ఇంతకు ముందు వచ్చినవాళ్ళు మీకిచ్చిన బహుమతి. ఈ బహుమతిని ఇలాగే కొనసాగించడానికి, మీ తర్వాత రాబోయేవారికి మీకు నచ్చినంత చెల్లించండీ' అని గమనిక మాత్రం ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు వారికిష్టమైన వంటలు చేసి వడ్డించవచ్చు. ఇలాంటి కేఫ్‌లు అహ్మదాబాద్, ముంబాయ్, పూనేల్లోనూ ఉన్నాయి. ఈ సేవా కేఫ్ నుండి స్వచ్ఛంద సంస్థలకు కూడా భోజనాలు అందుతాయి.

తీహార్ జైల్ ఫుడ్ కేఫ్

ఢిల్లీలో ఉన్న ఈ క్యాంటీన్‌ను ఖైదీలు నిర్వహిస్తున్నారు. తీహార్ జైలుకు అర కిలోమీటరు దూరంలో ఉండే దీన్ని తీహార్ జైలుల్లోని ఖైదీలకు పునరావాసం కల్పించే ఉద్దేశంతో ఏర్పాటు చేశారు. దక్షిణ ఆసియాలోనే అతి పెద్ద జైలుగా గుర్తింపు ఉన్న ఈ జైల్లో జీవిస్తున్నవారికి తిరిగి మంచి జీవితాన్ని గడపడానికి అవసరమైన సామర్థ్యాన్ని కల్పించడమే ఈ క్యాంటీన్ లక్ష్యం. ఈ రెస్టారెంట్లో పనిచేసే ఖైదీలకు కొన్ని అర్హతలు ఉన్నాయి. పన్నేండేళ్ళ జైలు జీవితం గడిపినవారు, ఉన్నత పాఠశాల విద్య అభ్యసించినవారు, మరో రెండు సంవత్సరాల్లో విడదలకు సిద్ధంగా ఉన్నవారిని ఇక్కడ పనిచేయడానికి అనుమతిస్తారు. పారిపోవడానికి ప్రయత్నించకుండా, సైకిల్ పైన లేదా కాలినడకన వెళ్ళి పని చేయగల్గినవారు, ఎవరికి సెక్యూరిటీ అవసరం లేదని అధికారులు నమ్ముతారో అలాంటి ఖైదీలు ఇక్కడ సేవలందిస్తారు.

పాప్‌డా-వడ రెస్టారెంట్

ఆకలితో అలమటించే వారికి, పేదల కొరకు ఏర్పరచిన ఉచిత కమ్యూనిటీ ఫ్రిజ్, ఈ 'గీవింగ్ ట్రీ' పాప్‌డా-వడ రెస్టారెంట్. దేశంలో ఆకలి బాధను తట్టుకోలేక చనిపోతున్నవారి సంఖ్య పెరిగిపోతున్న తరుణంలో అలాంటి వారికి తిండి పెట్టాలనే సంకల్పంతో మినూ పౌలిన్ దీన్ని ప్రారంభించారు. కేరళలోని ఎర్నాకుళంలో ఈ చైన్ రెస్టారెంట్ కొనసాగుతోంది. 24 గంటలూ అందుబాటులో ఉండే ఫ్రిజ్ ఒకటి ఇక్కడ ఉంటుంది. ఈ రెస్టారెంట్ ప్రతీరోజూ 50 భోజనం పొట్లాలు ఫ్రిజ్‌లో ఉంచుతుంది. అంతే కాకుండా ఎవ్వరైనా సరే తమకు ఎక్కువైన భోజనాన్ని ఈ ఫ్రిజ్‌లో పెట్టవచ్చు. అయితే వండిన తేదిని ప్యాకెట్‌పై రాయాలి. అప్పుడు పదార్థం చెడిపోయే సమయానికి దానిని పారేస్తారు. అకతాయిల నుండి రక్షణ కోసం సిసి కెమెరానూ అమర్చారు. ఇక్కడ రుచికరమైన కేరళా భోజనంతోపాటు, సేవ చేసే అవకాశం కూడా ఉంటుంది.

మైనస్ 6 డిగ్రీస్

ఇది కోల్‌కతాలో మొట్టమొదటి ఫ్రోజెన్ (గడ్డకట్టేంత చలి) బార్ అండ్ రెస్టారెంట్. దీనిలోకి అడుగుపెట్టాలంటే వెచ్చదనం ఇచ్చే బట్టలు, గ్లౌజ్‌లు ధరించాలి. వాటిని రెస్టారెంట్ వాళ్ళే ఇస్తారు. రెస్టారెంట్ లోపల నిర్మాణం అంతా గడ్డకట్టిన ఐస్‌తో ఉంటుంది. విశేషం ఏంటంటే, ఇక్కడ కస్టమర్లకు బహుమతిగా అందించే కాక్‌టైల్, మాక్‌టైల్స్ షాట్స్ తాగడానికి ఐస్ క్యూబ్స్ వాడకుండా ఐస్ గ్లాసుల్లోనే ఇస్తారు. ఇక్కడ శాఖాహారం మాత్రమే ఉంటుంది. చక్కిలిగింతల ఈ చలి రెస్టారెంట్ కొత్త అనుభూతి ఇస్తుంది.

డైలాగ్ ఇన్ ది డార్క్

బెంగళూరులోని ఈ రెస్టారెంట్‌కు వెళ్ళిన వారు జీవితంలో కొంత సమయం అంధులుగా ఉండే సరికొత్త అనుభూతి పొందవచ్చు. లోపలకి వెళ్ళే ముందు మీ దగ్గరున్న మొబైల్ ఫోన్లు వంటి లైట్ సౌకర్యం ఉన్న వస్తువులను వాళ్ళకిచ్చి వెళ్ళాలి. తిరిగి బయటకి వచ్చిన తర్వాత మీ వస్తువులు ఇచ్చేస్తారు. శాఖాహారం కావాలో, మాంసాహారం కావాలో ముందే చెప్పాలి. ఎందుకంటే లోపల మీరు తినే వస్తువును గుర్తించేటంత వెలుగు కూడా అక్కడ ఉండదు, పూర్తిగా చీకటి మాత్రమే కనిపిస్తుంది.



నేచర్ టాయ్‌లెట్ కేఫ్

అహ్మదాబాద్‌లోని ఈ రెస్టారెంట్ భారతదేశంలో ఉన్న అద్భుతమైన రెస్టారెంట్లలో ఒకటిగా నిలిచింది. అయితే, పారిశుధ్యం అంటే పడిచచ్చేవారు దీని పేరు వింటేనే హడలిపోతారు. ఈ అసాధారణ రెస్టారెంట్‌లో ఇరవైకు పైన రకాల్లో లావెట్రీలు, యూరినల్స్ టేబుళ్ళు, కుర్చీలు ఉంటాయి. 1950ల్లో చేసినవాటి నుంచి ఇప్పటి వరకూ ఉన్న వైవిధ్యమైన రూపాలు కనిపిస్తాయి. తినడానికి లావెట్రీలపై కూర్చోవడం కాస్త ఇబ్బందికరంగానే ఉంటుంది. అక్కడ అందించే కొన్ని పాత్రలు కూడా అవే ఆకారంలో ఉండటం విశేషం. కానీ వీటిని ఆ విషయానికి మాత్రం వాడరు. కేవలం టాయ్‌లెట్ థీమ్ కోసమే.



కవిత్వం

కలను ఉరి తీశారెవరో

కలను ఉరి తీశారెవరో
కలకు ఉరి తాళ్లతో సమాధానం
ఒక లెక్కా....?
కలలు పూలంత సహజంగా పూస్తాయి
పూయాలి
కలలు కనమని చెప్పే ధైర్యం కొందరికదే
కలల సాకారం కూడా
కొలిమిలో సల సల మరిగే
పాదరసంలాంటి ఒక అనుభవమే కదూ
పిట్టవాలే చెట్టులాంటి కల కోసం
ఏటి ఒడ్డున చెలిమె తోడే
చేతుల్లాంటి కల కోసం
ఆకలి కడుపుల్లో
అన్నం కురిసే వానలాంటి కల కోసం
శ్రమ దోపిడీ లేని
నిఖార్సయిన రాజ్యం పాలించే
రోజు లాంటి కల కోసం
నిత్యం కల గంటూనే వున్నాను
కల కల గానే మిగిలి పోతోంది
పుట్టిన కలను పుట్టినట్టే ఉసురు తీసే
కలల్ని ఉరితీసే దళారీ తలార్ల
ఉసురు తీసే మరో కల...
ఇప్పడే మొదలయింది
కల కదన రంగంలో
ఎర్ర పూల జాతరయిందదిగో....

- చిత్తలూరి
9133832246

డెడ్ లైన్

ఆకలేసి కడుపు కాలి
వీధిలో వెర్రి కేకనై నేను అరుస్తున్నపుడు
తన కబుర్లకి ఊ కొట్టడం లేదని
ఆయుధం లాంటి నా గొంతు మీద
అరికాల్తో తొక్కుతున్నాడొకడెవరో!
నా గొంతు మూల మూలల మూలుగుల్నొక
పాటగా చేస్తుందనేమో!
ఓ రాచనగరు నిర్మాణంలో
రాత్రింబవళ్లు వొళ్లలసిపోతున్నప్పుడు
గాలి మేడల పునాదులకి రాళ్లెత్తలేదని
మట్టి బొమ్మల కొలువుల్లాంటి
నా చేతుల మీద లాఠీలతో కొడుతున్నాడెవరో!
నా చేతులు,
పుల్లా పుల్లని కలిపాక పోగుపెడుతాయనేమో!
ప్రారంభోత్సవాల కోసమే మొలిచిన
రాతి చెట్ల దాహం కోసం
నెర్రెలు బారి నీరై పారలేక
సతమతమౌతున్నపుడు
అనాది నుండి నేలతో ముడివేసుకున్న
శతకోటి పాదముద్రల నా నడకని
ముక్కలు ముక్కలుగా నరుకుతున్నాడెవరో!
నా దేహం,
తుఫానుల్ని దాటవేసిన తీరమౌతుందనేమో!!
అతడెవరో గానీ టెండర్ల ముగింపు రోజున
మా శ్రమకి హడావుడిగా లెక్కలేస్తున్నపుడు
మొదలూ చివరా కనబడని
ఆ పరుగుపందెం బరిలో
నేను నిలబడనన్నప్పుడు
ఎన్నో విప్లవాల పులి దెబ్బలు తిన్నా
నా బతుకు నవీన శిల్పం మీద
రూపంలేని తనాన్ని చెక్కుతున్నాడెవరో!
నా ఉనికి, సరిహద్దుల్ని చెరిపేసే
మరో కొత్త భాగస్వామ్యమౌతుందనేమో!
ఏమో రాజో!! మంత్రో!!!
అతడెవరైతేనేం
శ్రామిక లోకపు బలాన్ని మొత్తం
ఒక్క పూటలో పిండేసుకోవాలా??
దాహం తీరని ఏసీ ఎడార్ల ముందర
చావో రేవో ప్రాణాలకిలా పోటీ పెట్టాలా??
ఎవడి గుర్రమో నీళ్లు తాగాలని
చెరువుల్నే ఎదురు పరిగెత్తమంటాడా??
కన్సల్టెంట్లతో
రాత్రికి రాత్రి ఒక్కడే రాసుకున్న
ప్రాజెక్టు రిపోర్టు కాదే??
చెరువంటే
వాడూ నేనూ
ఎన్నో తరాలుగా
నాగేటి చాళ్లలో
నార్లు పోసిన నాగరికత కదూ??

- శ్రీరామ్ పుప్పాల
sreerampuppala@yahoo.co.in

కథల కార్ఖానా

విమూత్నం



ఈ మధ్య ఎక్కడ చూసినా పిల్లలందరూ స్మార్ ఫోన్లు, ట్యాబ్‌లకి అతుక్కుపోతున్నారు. బుజ్జగించి కథలు చెప్పేందుకు నానమ్మ తాతయ్యలు కూడా కరువవుతుండటంతో పిల్లల ఆటా పాటా అన్నీ ఆన్‌లైన్‌లోనే వెతుక్కోవాల్సొస్తోంది. అక్కడక్కడా కథల పుస్తకాలు కనిపిస్తున్నా ఇంగ్లిష్, హిందీ భాషలకే పరిమితమవుతుండడంతో చాలామంది పిల్లలు ఇప్పటికే విజ్ఞానాన్ని పెంచే కథలకి దూరమవుతున్నారు. అలాంటి పిల్లలందరూ హాయిగా కథలు చదువుకునేందుకు 'స్టోరీ వీవర్స్' వెబ్‌సైట్ ద్వారా వివిధ ప్రాంతీయ భాషల్లో బాలసాహిత్యాన్ని అందిస్తోంది ప్రథమ్ బుక్‌హౌస్.

బెంగుళూరుకు చెందిన ఎన్‌పిఒ పబ్లిషింగ్ సంస్థ ప్రథమ్ బుక్‌హౌస్. సాంకేతిక రంగంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా ఇప్పుడు పిల్లలు ఏ విషయానికైనా ఇంటర్‌నెట్ పైనే ఆధారపడుతున్నారు. చిన్నారులకు విజ్ఞానాన్ని పెంచే పంచతంత్ర, భేతాళ కథలన్నీ కనుమరుగవుతుండటంతో వాటన్నిటినీ నేటి తరానికి పరిచయం చేసేందుకు కృషిచేస్తోంది ప్రథమ్ బుక్‌హౌస్. వివిధ ప్రాంతాల్లో ప్రచారంలో ఉన్న కథలన్నిటినీ వెలికితీసి ప్రాంతీయ భాషల్లో స్టోరీవీవర్స్ వెబ్‌సైట్ ద్వారా పిల్లలకందిస్తున్నారు. భారత్‌లో ఒకప్పుడు 780 భాషలు వాడుకలో ఉండేవి. యాభై ఏళ్లలో 300 భాషలు మరుగునపడ్డాయి. ఇంకా కొన్ని భాషలు ప్రపంచానికి తెలీకుండా పోయే ప్రమాదంలో ఉన్నట్టు పీపుల్స్ సర్వే ఆఫ్ ఇండియా (పిఎల్‌ఎస్‌ఐ) తన నివేదికలో వెల్లడించింది. కనుమరుగవుతున్న భాషలతో పాటు మాతృభాషలో చిన్నారులకు కథలని అందించేందుకు స్టోరీ వీవర్స్ వెబ్‌సైట్ ద్వారా ముందుకొచ్చిందీ ప్రచురణ సంస్థ. తొలిదశలో పిల్లల వికాసాన్ని, వినోదాన్ని పంచే 800 పుస్తకాలని 24 ప్రాంతీయ భాషల్లో స్టోరీ వీవర్స్ ద్వారా పిల్లలకి అందుబాటులో ఉంచారు. పుస్తకాలని అందించే ఓ లైబ్రరీలా కాకుండా చిన్నారుల సొంత సృజనకి పదును పెట్టే వివిధ పనులని ఈ వెబ్‌సైట్‌లో నేర్చుకునే వీలుంటుంది. కథకి అనుగుణంగా బొమ్మలు గీయడం, ఇతర భాషల్లో ఉన్న కథలని మాతృ భాషలో అనువదించడంతోపాటు చిన్నారులు సొంతంగా కథలు రాసి వెబ్‌సైట్‌లో పోస్ట్‌చేసే అవకాశాన్ని కల్పించారు. పిల్లలతోపాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా వారు రాసిన కథలని ఈ వెబ్‌సైట్‌లో పొందుపరచవచ్చు. వారికి తెలిసిన వివిధ అంశాలని పోస్ట్ చేయడంతో పాటు, ఇతరులు రాసిన కథల్లో అక్షర దోషాలని సరిచేయొచ్చు. చిన్నారులు గీసిన బొమ్మల్ని వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసిన కథలకి జోడించి ప్రాంతీయ భాషల్లో వాటిని చదువుకునేలా పిల్లలకి అందుబాటులో ఉంచుతారు.

విదేశీయులకూ నచ్చుతున్నాయి

మంచి పాఠకులే మంచి అభ్యాసకులవుతారు. మరి పిల్లల్ని పుస్తకాలు చదివించాలంటే ఆసక్తికరమైన విషయాలని అందించాల్సి ఉంటుంది. ఈ విషయాలపై అవగాహన ఉన్న ప్రథమ్ బుక్‌హౌస్ స్టోరీ వీవర్ వెబ్‌సైట్‌లో పిల్లలకి ఎప్పటికప్పుడు కొత్త విషయాల్ని అందిస్తోంది. దీనితో పాటు భారత్ బంజారి, లంబాడి, కురుక్, ఒరాన్, గొండి, ముందారి, సద్రి, సంతాలి, కొర లాంటివి లిపి లేని భాషలు మరుగున పడకుండా ఉండేందుకు ఆదివాసీ తెగల్లో ప్రచారంలో ఉన్న కథలనీ ఇతర ప్రధాన భాషల్లో అందించేందుకు కృషిచేస్తోంది ప్రథమ్ బుక్‌హౌస్. ఇక్కడ పొందుపరిచిన కథలు విదేశీయులనీ ఆకట్టుకుంటున్నాయి. ఇప్పటికే మన గ్రామీణ కథలన్నిటినీ జపనీస్, పోర్చుగీస్, హిబ్రు, స్పెయిన్ భాషల్లోకి వీటిని అనువదించారు. ఫార్సీ, కిస్వాహిలి, హౌస, కయొ, ఖమిర్ లాంటి అరుదైన విదేశీ భాషలోన్నూ పిల్లల కథలు లభిస్తాయి. స్టోరీ వీవర్స్‌లో పొందుపరిచిన కథలను కథల పుస్తకాలుగా వివిధ స్వచ్ఛంద సంస్థలు మారుమూల గ్రామాల్లోని చిన్నారులకు అందిస్తున్నారు. ఈ ప్రయాణం ఇక్కడితో ఆగిపోలేదు. ఇది విదేశాలకు ప్రయాణిస్తోంది. ఆఫ్రికా స్టోరీ బుక్ ప్రాజెక్ట్‌ని నిర్వహిస్తున్న ఒక ఆఫ్రికన్ సంస్థ స్టోరీ వీవర్స్ సైట్‌లోని కథలని ఆఫ్రికా ప్రాంతీయ భాషల్లోకి అనువదించింది. అక్కడ ప్లేస్కూళ్లలో చిన్నారులకి ఈ కథలని చెప్పడంతో పాటు విద్యార్థులకిచ్చే వివిధ ప్రాజెక్టులకి ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. భారత్‌లోని లఢక్ ప్రాంతంలో భూభాగానికి వందల అడుగుల ఎత్తైన ప్రదేశంలో కొన్ని కుటుంబాలు జీవిస్తున్నాయి. బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా బతుకుతున్న ఇక్కడ పిల్లలందరికీ బయటి కథలని పరిచయం చేసింది '17000 ఫీట్' సంస్థ. స్టోరీ వీవర్స్ సైట్ ద్వారా సేకరించిన హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ భాషలతో పాటు ప్రాంతీయ లఢకి భాషలో అనువదించిన కథల పుస్తకాలు లఢక్ కొండ ప్రాంతాల్లోని పిల్లల బోధనకి దోహదపడుతున్నాయి. వారి అవసరాన్ని బట్టి మరిన్ని కథలని వెబ్‌సైట్‌లో ఉంచేందుకు కృషిచేస్తోంది ప్రథమ్ బుక్‌హౌస్. వీటితో పాటు కథలని బ్రెయిలీ లిపిలో, ఆడియో, వీడియో రూపంలో, యూట్యూబ్, మొబైల్ యాప్ ద్వారా అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇతరులు స్వచ్ఛందంగా ఇచ్చే పిల్లల పుస్తకాలని కూడా ఈ వెబ్‌సైట్‌లో ఉంచుతారు. ప్రతి చిన్నారి కథలు చదవాలనే లక్ష్యంతో రూపుదిద్దుకున్న స్టోరీ వీవర్స్ ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది చిన్నారుల ఆదరణ పొందింది.



\- శర్వాణి

రథయాత్ర



- చాగంటి సోమయాజులు

బొంగరం పట్టుకొని బయల్దేరేడు. బొంగరం కొని మూడు రోజులే అయింది. చూడ్డాని కొచ్చిన చుట్టం చేతిలో పెట్టేడు అర్ధణా. దమ్మిడీ ఇచ్చి స్వయంగా ముల్కీ వేయించుకొన్నాడు. తాత పేని పెట్టేడు చేకుతాడు.

హైస్కూల్లో కెళ్లాడు. తోటి కుర్రాళ్లెవరూ రాలేదు. వెనక వరండాలో కెళ్లాడు. దగాచేశారు. వస్తామని ఎవరూ రాలేదు. కుక్క జాలితో. బొంగరం తిప్పాడు. ఎరుపు, ఆకుపచ్చ, రంగుల లక్క బొంగరం గింగిని రింగు పెడుతూ కునుకుపెట్టింది. అబ్బాయి బుర్రంతా ఎర్రగా, ఆకుపచ్చగా కునుకు పెట్టిన బొంగరం పై భాగంలో ఐక్యమై పోయింది.

అలాగ్గా తిరుగుతున్నప్పుడు జాలితో పైకెత్తి చేతిలో కెక్కించుకొంటే బాగుణ్ను. ముల్కీ కత్తిలాగుంది. చెయ్యి కన్నం పడి పోతుంది. సందేల్లో చింతగుంపు బొంగరానికైనా దెబ్బకి పేడు ఊడిరావాలి వెధవబాధ. ముల్కీకి అంత వాడి ఒక విధంగా వుంటేనే మంచిది. ఇంకొక విధంగా వుండనే గూడదు.

బొంగరం ముల్కీ అంచుల మీంచి కర్రని తిరిగి తికమకగా కొట్టుకొంటూ ఆగిపోయింది. అబ్బాయి ఆలోచించాడు. చాలా దూరం ఆలోచించాడు. భూమి గుండ్రంగా బల్లపం లాగుంటుందని, బొంగరంలా గిర్రని తిరుగుతున్నాదనీ చెప్పేడు మేష్టరు. కాని హిరణ్యాక్షుడు భూమిని చాపలా ఎలా చుట్టాడో? సమన్వయం కాక అబ్బాయి బుర్ర బద్దలైపోయింది. ఇలాంటి సందేహాలనడిగితే మేష్టరు సరిగ్గా సమాధానం చెప్పి సందేహాలు తీరుస్తారా? వెటకారాలాడుతాడు. క్లాసంతా పకపకా నవ్వుతారు.

హిరణ్యకశిపుడి కడుపున ప్రహ్లాదుడు పుట్టేడు కాని తానే పుడితే? చక్కా చంద్రుడికి ముల్కీ వేయించుకుని, వాసుకుని తాడుగా తీసుకొని బృందావనంలో బొంగరం తిప్పుకుణ్ను.

శ్రీరాముడి కథ చెబుతూ 'నాన్న చెప్పిన మాట వినాలని' మేష్టరు చెప్పేడు. రాముడు తండ్రిమాట వినే అడవులకుపోయి నానాబాధలు పడ్డాడు. మరి ప్రహ్లాదుణ్ని గొప్పవాడంటారెందుకూ తండ్రి చెప్పినట్టు వినలేదు సరికదా విష్ణుమూర్తిచేత తండ్రి ప్రాణాలు తీయించాడు.

హైస్కూలు పక్కింటి పెరట్లో ఎర్రగా, పచ్చగా బాదం చెట్టు ఆకులు మూడుగంటలెండలో మెరుస్తున్నాయి. పచ్చగా కాయలు. ఎర్రగా పళ్లు గుత్తులు గుత్తులుగా వేళ్లాడుతూ ఉంటే పచ్చని రామచిలకలు ఎర్రని ముక్కుల్తో పొడుచుకు తింటున్నాయి. ఇటికి ముక్కని అబ్బాయి ఫైట్టని విసిరితే దెబ్బకి గుత్తికి గుత్తీ కాయలూ పళ్లతో రాలింది. అందులోంచి ఆకుపచ్చని సాలీడు తొందరగా గోడమీదికి పాకిరిపోయింది. అరుస్తూ రామచిలకలు పచ్చతోరణంలా ఎగిరిపోయాయి. అబ్బాయి బుర్రంతా ఎర్రగా ఆకుపచ్చగా అయిపోయింది. 'ఎవడ్రా వెధవ' అంటూ లోపలినుంచి కేక వినబడ్డాది. అబ్బాయి గుండె గడగడలాడినా అందినకాడికి కాయల్ని ఏరుకొని స్కూలువతల వరండాలోకి పారిపోయాడు.

పళ్లపై తొక్కలు కొరుక్కుతింటూ చూచాడు గోడమూల దాగరంతా సాలిగూడు కనబడ్డాది. చిక్కగా,సన్నంగా, ధవళంగా నేయబడ్డాది. అలాంటి పట్టుశాలీ వలువలు పెళ్లానికి కట్టబెట్టాలి. సాలిగూట్లో ఇంకా మంచుచినుకులు కనబడ్డాయి. అప్పుడప్పుడే పడుతున్న మధ్యాహ్నం ఎండలో పచ్చగా, ఎర్రగా జిగాలుమంటూ మెరుస్తున్నాయి. అలాంటి రవ్వల హారం పెళ్లాం మెళ్లోవెయ్యాలి.

బాదంకాయ లొక్కడే తింటే బాగులేదు. ఊరించడాని కెదురుగా ఒక్కడైనా లేకపోయాడు. అన్ని బాదం కాయలు దొరికాయంటే ఎవళ్లూ తర్వాత నమ్మరేమో అని భయపడ్డాడు. కిటికీ ఎక్కి వాసం మీద ఎగబాకి వెలిసిమీద కాయలన్నీ తిండంమాని దాచాడు. బాదంకాయల్లో, సాలిగూట్లో, మంచుచినుకుల్లో పిచ్చి ఆలోచనల్లో మరిచిపోయాడు. తాను ఇల్లు బయలుదేరిన కారణం "అమ్మబాబో!" అని పెద్ద కేకేసి పరిగెట్టాడు.

ఆ వేళ మారు రథయాత్ర

మండావారి చిన్నగాణ్ని, బొంతావారి బొట్టేణ్ణి, పైడితల్లినీ పోగుచెయ్యాలి. నలుగురు రాక్షసులనీ వెంటబెట్టుకొని యాత్ర వెళ్లాలి. పరుగెట్టాడు. బొంతావారింటికి వాళ్ల బొట్టేడు లేదు. పరిగెట్టాడు. మండా వారింటికి వాళ్ల పిల్లడూ లేడు. వాళ్లంతా తన్ని మోసంచేసి రెండింటికే వెళ్లిపోయారు దగాకోర్లు.

పోసి, బతికాడు. వాళ్లతో ఇసకగడ్డల్లో గెంతడం, మచ్చుకొండెక్కడం,అల్లరి తప్పిపోయాయి. వాళ్లంతా బికారీలు, తనో ఆరుకానులున్న ఐశ్వర్యవంతుడు. వాళ్లనాన్న మురిపించి మురిపించి ఎలాగైతేనేం కాణీ ఇచ్చాడు. అమ్మ అడగ్గానే పారేసింది అర్ధణా. అది తాతయ్య చూచి ఒక్క కాణీయే ఇచ్చి 'చాల్లే' అనేశాడు. పారవలసీచోట పెద్దవాచిక పారిందికాదు. అమ్మమ్మ రహస్యంగా పిలిచి మరీ ఇచ్చింది అర్ధణా. అమ్మమ్మ దగ్గర ఏ.ఆవకాయ గూనలవారో ఎవరికీ తెలియకుండా డబ్బు వుంది.

ఇంట్లో బియ్యం అవీ దొంగచాటుని

అమ్మి ఏకాశినాడు కొబ్బరికాయలు కొని దేవాలయంలో అభిషేకం చేయిస్తుంది.

కాశీ రంగులరాట్నంలో కాణి పకోడీలు, అర్థణా కిర్రు చక్రం తప్పవు. అక్కడి కెంతున్నా అర్థణా బొమ్మల లాటరీ వెయ్యొచ్చు. నెమలిమీద కాస్తే, మూడు నెమళ్లు వస్తే రెండు కానుకలకే ఆరుకానులొస్తాయి. అప్పుడో తోక తక్కువ తాంబై కొనుక్కోవచ్చు.

పెద్ద వీధిని బడి వేలకొద్దీ జనం బయల్దేరారు. పల్లెటూరి వాళ్లు మందలు మందలుగా వెళ్తున్నారు. తోవ తప్పిపోకుండా ఒకరి చేతుల్నొకరు పట్టుకున్నారు. వెర్రివాళ్లు. దాసన్నపేటలో తోవ తప్పిపోవడం ఏమిటి? అబ్బాయి కన్నీ వీధులూ తెలుసు. తెలియని చిక్కు వీధుల మధ్యనుండి వెళుతూ వుంటేనే సరదా. చిన్నచిన్న వీధులన్నీ ఆఖరికి తెలిసిన పెద్ద వీధులకి తేలుతూనే వుంటాయి. అబ్బాయికి పట్నాల్లో వీధుల రహస్యం బోధపడింది.

వో తాతవారు చక్రాల కుర్చీమీద మనవణ్ని ఇడ్చుకుంటూ వొస్తున్నాడు. మనవణ్ణి చూచుకొంటూ తాత మొహం పొంగిపోయింది. మనుమడు దూద్‌పేడా తింటూ చొంగలు కార్చుకొంటున్నాడు. కిందికీ మీదికి ఎగిరే అట్టకోతిని పట్టుకొన్నాడు.

వాళ్లక్లాసు మేష్టరుగారు గబుక్కున కనబడ్డారు. అబ్బాయి గుండె లటుక్కుమంది. అదెంచేతో మేష్టర్ని చూస్తే ఏమేనా భయం వేస్తుంది. మేష్టరుగారు ఎడపిల్లణ్ణి చంకలో పెట్టుకొన్నారు. పెద్ద పిల్లాడు పక్కన నడుస్తున్నాడు. ముందు నడుస్తున్నాదో బోడెమ్మ. వెనక నడుస్తున్నాది బుర్రొంచుకొని, చందనం బొమ్మ పట్టుకొని, చంటి పిల్లాణెత్తుకొని చందనం బొమ్మలాంటి మేష్టరాణీ. తెల్లగా పళ్లిగిలించి ఎందుకో నవ్వుతున్నాది.

మేష్టరిగారి చంకలో పిల్లాడి ముక్కోడి పోతున్నది మేష్టరుగారు (అసహ్యం, మెంచేతలేదో) ముక్కు తుడిచి తొడ మీద పంచెకి తుడుచుకొంటున్నాడు. ఛీ:ఛీ: అదిచూచి అబ్బాయి వొళ్లంతా అసహ్యంతో జలదరించింది. మేష్టరుగారు కూడా ఇలాంటి పనులు చేస్తాడో అనుకొన్నాడు. మేష్టరుగారికి పెళ్లాం పిల్లలుంటారా అని తెల్లబోయాడు. ఉంటారన్న సంగతి ఎంచేతో అబ్బాయికి అదివర కెప్పుడూ తట్టలేదు.

డబ్బులెవ్వరూ కాటేయ్యకుండా అడ్డంగా జేబునిండా బొంగరం ఇరికించి, జాలు మెళ్లో చుట్టపెట్టుకుంటూ జనప్రవాహంలో పడ్డాడు. గుండ్రంగా ఎత్తుగా వున్న జేబు. పచ్చగా ఎర్రగా బొంగరం పై భాగం కనబడుతున్నాది అస్తమానం దాన్నోమారు,చేత్తో సవరిస్తూ నడుస్తున్నాడు. సరికొత్త బొంగరం, అసలు శృంగవరపు కోట లక్క బొంగరం, పడుచువాడికి ప్రియురాలి ముఖం కన్నా ప్రియతరంగా ఉన్నది అబ్బాయి గుండెలి మీదా బొంగరం.

ఓ బోడెమ్మ పెద్ద కృష్ణుడి బొమ్మని గుండెలికి గట్టిగా అదిమి పట్టుకొని వో వారగా చీమలా నడుస్తున్నాది. అబ్బాయి పక్కున నవ్వి ' బోడెమ్మగారూ బాగున్నారా. అని పలకరించాడు.

'నీకెం పోగాలంరా గుంటకక్క గట్టా అని బోడెమ్మ పళ్లు బిగించింది. ఆరకంగా తిట్లు తింటూ వుంటే సుఖంగా వుంటుంది. అబ్బాయికి సంతోషానికి బదులు విచారం పట్టుకుంది. బోడెమ్మని బాగా అల్లరి పెట్టడానికి బొంతావారి బొట్టడైనా సమయానికి లేకపోయాడు. ఎంతైనా నలుగురున్న సాటిరాదు. ఒంటిగాడై పోయాడు. అల్లరి లేకపోతే తీర్థమేమిటి?



'బోడెమ్మగారూ! కృష్ణుణ్ని గట్టిగా పట్టుకోకండి, మంచి వాడుకాడు' అన్నాడబ్బాయి.

'గుంట చచ్చినాడా అని మీదికి ఏం చేదామనో బోడెమ్మ వెళ్లింది. అబ్బాయి బెదిరిపోలేదు.

'బొమ్మ పడిపోతుంది. కోపం వద్దు బోడెమ్మగారూ శాంతం భోషాణం శాంతం భోషాణం' అని హితోపదేశం చేస్తూ మెల్లిగా వెళ్లిపోయాడు. కానీ నవ్వు పట్టలేకపోయాడు. రోడ్డుమీద ఐదు నిమిషాలు నిలబడిపోయి, గూనివానిలాగ వొంగిపోయి నవ్వి నవ్వి చచ్చాడు.

రథయాత్ర దగ్గిర పడ్డాది

పెద్ద దుకాణం నిండా కుండబొమ్మలు నింపేశారు. ధగధగ లాడుతున్నాయి బొమ్మలు వాట్నిచూస్తు నిలబడ్డాడు. అందులో చాలా బొమ్మలు వాళ్లింట్లో ఉన్నవే మురళీ కృష్ణుడు శేషశాయి, గజలక్ష్మి, మడిగాళ్లేసుకున్న గాంధీ వాళ్లక్కయ్య ఎలాగా దసరా కొచ్చి బొమ్మల కొలువు పెడుతుంది. భోషాణంనిండా బోలెడు బొమ్మలున్నాయి – బూజు దులపాలిగాని.

బొమ్మల దుకాణం దగ్గర ఆ బొమ్మలన్నింటికన్నా అందమైన అమ్మాయి కనబడ్డాది ఆరేళ్ల దాన్ని చూస్తు అబ్బాయి నిలబడిపోయాడు. దాని మొహం తెల్లమతాబాలాగా వెలుగుతున్నది. చక్కని చుక్క అబ్బాయి ఎగాదిగా వెర్రివెధవలా చూచినా అమ్మాయి కన్నెత్తి చూచింది కాదు దాని జబ్బమీద కొట్టి తనే అడిగేడు 'మీ ఇంటిపేరు ? ' అమ్మాయి అప్పుడు వాణ్ణి చూచి 'మంగువారు' అన్నాది. అమ్మాయికి సిగ్గులేనేలేదు. వాళ్లమ్మమ్మ పెళ్లానికి మొగుడి దగ్గర సిగ్గు ఉంటుందని చెప్పింది. అన్నట్టు ఇంకా ఆ పిల్ల నాకు పెళ్లాం కాలేదు కదా' అనుకొన్నాడు.

'నీ పేరు '? అనడిగాడు

'తాయారు'

'తాయిలం కొనిపెడత తాయారుకి ' అంటూ చిన్న కవీశ్వరుడయిపోయాడు అతని గుండెలు పాడింది అతని గుండెలు వొణికింది పిల్లకి పెళ్లయిపోయిందేమో?నీకు పెళ్లయిందా? ' అని అడిగాడు. 'చిన్న పిల్లలకి పెళ్లవుతుందా?' అని అమ్మాయి నవ్వింది. ఫస్టుగా కుదిరింది మంగువారి తాయారు మా మంచి పిల్లా పెళ్లాడుతాను, పెళ్లాడుతాను' అంటూ అమ్మాయి చెవిలో ఊదేడు. 'ఇదేంటి పిల్లాడా? ఫో అన్నది. తాయారు నవ్వుతూ దాని మొహం ఎప్పుడూ ఆరని తెల్లని మతాబా.

తాయారు తల్లి అబ్బాయిని చూచింది.

'ఎందుకబ్బాయి అలా నిలుచున్నావు" అని మహాధాటిగా అడిగింది. సమాధానం చెప్పలేక కటకట లాడాడు.

'తాయారు' చేతిలో పొట్లాంవున్నదా? దొంగవెధవలను మా గెద్దల్లా తన్నుకుపోతారు.' అన్నది కాబోయే అత్తగారు అబ్బాయికి మహాకష్టమనిపించింది.

"అన్యాయం మాటలాడకండి నేను దొంగను కాను. కావలిస్తే మీ అమ్మాయికి నేనే ఇస్తాను. నాదగ్గరారుకానులున్నాయి' అన్నాడు గర్వంగా.

'గొప్పగుంట వెధవ్వి! చింకిచొక్కా నువ్వు' అన్నాది అబ్బాయి చిన్నబోయాడు. మొహం పచ్చగా ఐపోయింది. అప్పుడు కనబడ్డాయి జబ్బమీద చిరుగు, మెడమీద రగుడు, చెవుల మీంచి వేళ్లాడుతూ బొద్దులు మంచిచొక్కా తొడుక్కుందామనే అనుకున్నాడు ఆ తోపులాటలో పాడైపోడానికి మడత చొక్కా ఎందుకన్నాడు: వాళ్లనాన్న ఇలాగ్గా అవమానపడవలసి వస్తుందని కలగన్నాడా

'మాసి పోతుందని మంచిది కట్టలేదు నాకు సిల్కు చొక్కాలే వున్నాయి ' అన్నాడు.

'చాలు ఫో' అవతలికి ' అని గట్టిగా కసిరింది అత్తగారు.

'ఎందుకా అబ్బాయి నలా కసురుతావు:' అన్నాడు కాబోయే మామగారు - తాయారు నాన్న.

'దొంగవెధవ ఢీ' అన్నాది అత్తగారు

'అన్యాయం మాటలాడకండి ' అన్నాడబ్బాయి.

'నాన్న' ఆ అబ్బాయే నన్ను పెళ్లాడుతాట్ట అలా పాడుతున్నాడు' అన్నది తాయారు.

'దొరికి పోయానురా దేముడా, అనుకొన్నా డబ్బాయి, చెవులెర్రబారి వొంటినిండా వెంట్రుకలు లేచి నిలుచున్నాయి. 'ఓరి వెధవా: అందుకా అలా పుల్తూ పుల్తూ చూస్తున్నావు. సట్టున పదేళ్లు లేవు. కలికాలం వెధవా: అన్నాది అత్తగారు. 'నువ్వెవరబ్బాయివి: అనడిగాడు మామగారు

'మేము బాగా డబ్బున్న వాళ్లం మా తాతయ్యకి రెండు వేలొస్తాయి.

'అయితే నీ వెప్పుడు పెళ్లి చేయ్యమన్నావు:"

ఏ మో మా తాతనడగండి' నిజమే అనుకొన్నాడు తిట్లుతిన్నా, పెళ్లాం దొరికిందనుకున్నాడు. వాళ్లకేం' బోలెడంత డబ్బున్నాది. ఎగిరి గంతేసి ఎవరు పడితే వాళ్లు తనకి కట్నాలు, కానుకలూ ఇచ్చి పిల్లని తన కాళ్లమీద పడేస్తానని వాళ్లమ్మమ్మ చాలాసార్లు చెప్పింది.

'ఫో వెర్రివెధవా! అన్న మామగారి ఆఖరి కసురుతో వెనక్కి వెనక్కి చూస్తు, తాయారు మొహం జ్ఞాపకం బాగా వుంచుకొని వెళ్లిపోయాడు వాళ్లమ్మతో చెపితే తనకి. తాయారుని తప్పకుండా పెళ్లిచేస్తుంది. తెల్లటిపిల్ల అయితే కట్నాలైన ఆడక్కుండా చేసుకొందామని అమ్మమ్మ చాలా సార్లు చెప్పింది.

రథయాత్ర పెళ్లున విరిగిపడి సముద్రంలో పొంగిపోతోంది. జనం తిరుగబడి కెరటాల్లా ముందుకి కొట్టుకొస్తూ వెనక్కి వెళు తున్నారు. తోరణాల్లో, అరటి చెట్లతో, అలంకరణలతో శ్రీ జగన్నాథస్వామి రథం ముందుకి కలకల్లాడుతుంటే జేగంటతో వస్తున్నది.

అబ్బాయి ఆరుకాసులైశ్వర్యంతో తీర్థం లోపలకెళ్లాడు. పెద్దవాళ్ల కాళ్లలోంచి సందుచేసుకొని దూరుతూ ముందుకు సాగాడు. ఆ కాళ్ల సందుల్లోంచి రథయాత్ర హోరులోంచి తాయారు మొహం కనబడుతున్నాది అబ్బాయి మహాజన సముదాయంలో కలిసిపోయాడు. జనానికవతల రంగుల రాట్నాలు రయ్యని తిరగుతున్నాయి.

✦

కొత్త పుస్తకాలు

ఆత్మాభిమానాలు.. అంతర్మథనాలు

'సింగరాజు లింగమూర్తి రచనలు' 25 కథల సమాహారం. మధ్యతరగతి జీవనశైలిని రచయిత అతి దగ్గర నుంచి ఆవిష్కరించారు. చాలీచాలని వేతనాలతో సతమతమయ్యే ఉద్యోగుల జీవితాల్లో ఎదురయ్యే ఆర్థిక ఇబ్బందులు, అడ్డొచ్చే ఆత్మాభిమానాలు, అంతర్మథనాలు సానుభూతిని పొందుతాయి. 1943 నుంచి 1968 వరకు వివిధ పత్రికల్లో ప్రచురితమైన ఈ కథలు దేనికదే ప్రత్యేకం. అత్తెసరు వేతనంతో అవస్థలు పడుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న అహ్మద్ పిల్లల చదువుల కోసం రాత్రిళ్లు రిక్షా సైతం తొక్కుతున్నాడు. ఈ దశలో బదిలీ కావడంతో దాని నిలుపుదలకు చేసిన ప్రయత్నం ఫలించక పోగా, తన కోసం కూతురు శీలం అమ్ముకోవడం, క్షయతో భార్య మృతి చెందడం, చేసిన అప్పులు తీరకపోవడంతో అతను తనువు చాలించడాన్ని రచయిత గుండెల్ని పిండేలా వర్ణించారు. ఉద్యోగం చేసే స్త్రీ విషయంలో తోటి మహిళలే లేనిపోని పుకార్లు పుట్టించి భర్త అనుమానపడేలా చేసినా మొక్కవోని ధైర్యంతో నెగ్గుకొచ్చిన స్త్రీమూర్తికి నిదర్శనమే 'సమాజం-సరళ' కథ. మతిభ్రమించి అడుక్కునే వేణును ఇంటికి తీసుకు వచ్చి సపర్యలు చేసి మానవత్వం చాటుకుంటాడు శర్మ. వేణుకు జ్వరం రాగా ఆసుపత్రికి తీసుకెళ్లి బాగు చేయించడంతో మామూలు మనిషవుతాడు. ఈ దశలో అతను ఎవరో శర్మకు, అతని భార్య శారదకు తెలిసి



సింగరాజు లింగమూర్తి రచనలు.. కథలు
పేజీలు : 243
ధర : 170/-
లభించుచోటు :
నవచేతన పబ్లిషంగ్ హౌస్
నవచేతన బుక్‌హౌస్
ప్రజాశక్తి బుక్‌హౌస్
నవతెలంగాణా బుక్‌హౌస్

పోతుంది. వేణుకు రావాల్సిన ఉద్యోగాన్ని సిఫార్సు చేయించుకుని శర్మ పొందగా, అతను పెళ్ళాడాల్సిన శారద శర్మకు భార్య అవుతుంది. తమ ఇద్దరి వల్ల అతనికి అన్యాయం జరిగిందని గ్రహించి వేణుకు పెళ్లి చేయడానికి నిర్ణయించుకుని ఆ విషయం చెప్పడానికి ఆసుపత్రికి వస్తారు. 'జరగాల్సిందేదో జరిగి పోయింది. మీవల్ల నాకు పూర్వస్మృతి కలిగినందుకు కృతజ్ఞతలు' అని వేణు ఉత్తరం రాసి వెళ్లిపోవడాన్ని ఆసాంతం ఆసక్తికరంగా 'అన్వేషణ' కథలో వివరించారు. పండక్కి అల్లుణ్ణి తీసుకు వస్తే కొత్తబట్టలు కొనిపెట్టే పరిస్థితి లేక మదన పడుతున్న మామ దుస్థితిని గమనించిన అల్లుడు సదరు ఖర్చునంతా తానే భరించడాన్ని 'శుభగ్రహం' కథ ఆసక్తిగా చదివిస్తుంది. తమ తల్లిదండ్రులను, బంధువులను భార్య దుర్భాషలాడి అవమానించడాన్ని సహించలేని భర్త ఆమెకు దూరమై బదిలీ చేయించుకుంటాడు. దీంతో తప్పు తెలుసుకుని ఆమె క్షమాపణ కోరుతుంది. కులాంతర వివాహాల వల్ల కలిగే సమస్యలు, అవమానాలను 'క్షమామూర్తులు' కథలో చక్కగా చిత్రించారు. తాను ప్రేమించిన యువతి భర్తకే తాను ఆపరేషన్ చేయాల్సి రాగా పొరపాటున కడుపులో కత్తిపెట్టి కుట్లు వేయడంతో అతను చనిపోతాడు. చేసిన పొరపాటుకు డాక్టరు తన ఉద్యోగానికి రిజైన్ చేస్తాడు. చిన్న పొరపాటు వల్ల నీకు అన్యాయం జరిగిందని అతని భార్యకు చెప్పడాన్ని 'కాలం స్తంభించింది' కథలో హృద్యంగా వివరించారు. జీవితంపై విరక్తి పుట్టిన జగన్నాథం తాను ఆత్మహత్య చేసుకున్నట్లు పత్రికల్లో వార్తలు వచ్చేలా చేస్తాడు. తన యావదాస్తిని ధర్మ సంస్థలకు రాసి తాను భిక్షగాడిగా మారి పోయే 'అంతర్ముఖుడు' కథ ఆలోచింపజేస్తుంది. ఇలా మరికొన్ని కథలు కూడా ఆలోచింపజేస్తాయి. రచయిత లింగమూర్తి దివంగతులైన నాలుగు దశాబ్దాల అనంతరం ఈ కథలకు పుస్తక రూపం ఇవ్వడం ముదావహం.

- టి.డి.ప్రసాద్.

చిట్టితల్లి సవ్వాలి



- భారత్‌లో లింగ నిర్ధారణ పరీక్షలపై నిషేధం ఉన్నా అవి అక్రమంగా జరిగిపోతున్నాయి. ఇది 1000 కోట్ల రూపాయల అక్రమ, అనైతిక పరిశ్రమగా రూపుదాల్చింది. భ్రూణ హత్యలకు కారణమవుతోంది.

- ప్రపంచంలో ఏదోఒక చోట ప్రతి 10 నిమిషాలకు బాలికలు హింస కారణంగా మరణిస్తున్నారు.
- 16వ శతాబ్దం వరకు గాళ్ అనే పదంతో ఆడ, మగ ఇద్దరినీ సంబోధించేవారు.



- ఆఫ్రికా ఖండంలో మాధ్యమిక విద్య లేని బాలికలు దాదాపు 2కోట్ల మందిగా నివేదికలున్నాయి.

తెలుసా

- బాలికల హక్కుల ఉల్లంఘన, మానవహక్కులకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్లని ప్రపంచానికి తెలియజేయడంతో పాటు బాలికలకు అవగాహన పెంచే ఉద్దేశంతో అంతర్జాతీయ బాలికల దినోత్సవం ఐక్యరాజ్యసమితి మొదట డిసెంబర్ 2011లో ప్రకటించింది.

- ప్రపంచ వ్యాప్తంగా 36 మిలియన్ల మంది బాలికలు పాఠశాల విద్యను అందుకోలేకపోతున్నారు.
- ప్రపంచవ్యాప్తంగా 70 కోట్లమంది అడపిల్లల వివాహాలు 18 సంవత్సరాలలోపు జరుగుతున్నాయి. వీళ్లలో ప్రతి ముగ్గురిలో ఒకరి కంటే ఎక్కువ మంది బాలికల వివాహం 15 సంవత్సరాలలోపే జరుగుతోంది.

- బాలికలకు అబ్బాయిలతో సమానంగా సరైన వనరులు, విద్యని అందించగలిగితే వారు ప్రపంచ వ్యాప్తంగా ఆకలి పస్తులు అనుభ విస్తున్న 16 శాతానికి తగ్గించగలరు.



Day of the Girl

- భారతదేశంలో 47 శాతం మంది మధ్య వయసు బాలికల్లో (కౌమార దశ) బరువు తక్కువగా ఉన్న లక్షణాలు కనిపిస్తాయి.

- కౌమార దశలో ఉన్న అమ్మాయిల స్థిరమైన అభివృద్ధి, లింగ సమానత్వం లక్ష్యంగా ఈ ఏడాది అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

- అన్ని అభివృద్ధి చెందుతున్నదేశాల్లో దాదాపు సగం శాతం ఆడపిల్లలు 18 సంవత్సరాలోపే తల్లులుగా మారడంతో ఆరోగ్యసమస్యల్ని ఎదుర్కొంటున్నారు.

చరిత్ర వేటగాడు

వివరం



ఢిల్లీలోని బాలినగర్‌లో నివసిస్తున్న ఆదిత్యవిజ్ వద్ద 3,000 కు పైగా అగ్గిపెట్టెలున్నాయి. పెద్ద సంఖ్యలో అతి ప్రాచీన పుస్తకాలున్నాయి. వంద సంవత్సరాల క్రితం ప్రచురించిన రవీంద్రనాథ్ టాగూర్, రుడ్‌యార్డ్ కిప్లింగ్‌ల ప్రముఖ రచనలు ఆదిత్య విజ్ సేకరణలో ఉన్నాయి. ఇంద్రజాల, అమర చిత్ర కథ, అమెరికన్ కామిక్స్ వంటివి. సగటు పుస్తకాల షాపులో లభించని అరుదైన కామిక్ పుస్తకాలు, పాతకాలపు మ్యాప్‌లు, తగరపు పెట్టెలు, ప్రాచీన కాలానికి చెంది ఇప్పటికీ మిగిలి ఉన్న వస్తువులు, ప్రాచీన చిహ్నాలు, ప్రముఖ వ్యక్తులకు సంబంధించి స్మారక చిహ్నాలుగా భద్రపరచబడిన వస్తువులు, బ్రిటీషు కాలంలో ఆంగ్లేయులు రాజుగా పట్టాభిషేకం చేసినప్పుడు ధరించే కిరీటం, తదితర వస్తువులు, రకరకాల టైప్ రైటర్లు, కెమెరాలు, రేడియోలు, రికార్డు ప్లేయర్లు, బాలీవుడ్ సినిమా, పోస్టర్లు, వింటేజీ కార్లు, స్కూటర్లు వంటివి బోలెడు వస్తువులు ఉన్నాయి. వన్య ప్రాణుల నమూనాల నుండి పక్షుల గూళ్ళు, గ్రుడ్లు, మొక్కలలోని భాగాలు ఇలా అన్నీ అదీ ఇదీ అని కాకుండా సేకరణకు పనికొచ్చేవన్నీ భారీ సంఖ్యలో ఆయన వద్ద ఉన్నాయి.

ఆదిత్య ఐదారేళ్ల వయస్సు నాటి నుంచే వస్తువులను సేకరించడం మొదలు పెట్టాడు. తన తండ్రితో కలిసి బయటకు వెళ్లేపుడు ఆయన కామిక్ బుక్స్, వన్యప్రాణులకు సంబంధించిన పుస్తకాలను సేకరించి చదివేవాడు. ఆయన స్ఫూర్తితో రకరకాల వస్తువులు సేకరించి దాచుకునేవాడు. అప్పటి నుంచి వస్తు సేకరణపై వ్యామోహం పెరిగి అది క్రమంగా ఆదిత్య కళ్లు ఎప్పుడూ అరుదైన వస్తువుల కోసం వెదుకులాడుతూనే ఉండే వరకు చేరింది. ఆయన సేకరణ అతిత్వరలోనే అద్భుతమైన చరిత్ర సృష్టించనున్నది. అగ్గిపెట్టెల నుంచి వింటేజీ కార్ల వరకు రకరకాల వస్తువులను సేకరించి వాటిని పరిరక్షించడమే పనిగా పెట్టుకున్నాడీ చరిత్ర వేటగాడు.

అరుదైన పోస్టర్లు

ఆదిత్య విజ్ భారతీయ విద్యాపీఠ్ యూనివర్సిటీ, పెరల్ అకాడమీలో మార్కెటింగ్ అండ్ ఫ్యాషన్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. దాదాపు కనుమరుగైపోయిన చేత్తో ముద్రించిన ట్రయొలో ప్రింట్ సినిమా పోస్టర్లను కొని ఆదిత్య విజ్ సేకరించాడు. 1942లో విడుదలై సంచలనం సృష్టించిన 'రోటి' సినిమా పోస్టర్‌తోపాటు, 1955 నాటి 'ఆజాద్', 1956 నాటి 'బారిష్' సినిమాల వాల్ పోస్టర్లు, సినిమా హాలులోని అద్దాల కిటికీలో ప్రదర్శించే చిన్న పోస్టర్లు కూడా ఆదిత్య విజ్ వద్ద ఉన్నాయి.

పాతవే మేలిమి

పాత వస్తువులను బంగారం కన్నా విలువైనవిగా భావిస్తాడు ఆదిత్య విజ్! ఏదైనా వస్తువు కాలక్రమంలో కనుమరుగై పోతుందనుకుంటే దానిని తక్షణమే సేకరించే పనిలో పడతాడు. కొత్త వస్తువులను కొనడం తేలికే! కానీ నలభై - యాభై ఏళ్ల కిందటి వాటి మాటేమిటి? అని ప్రశ్నిస్తాడు.

తన వద్ద ఉన్న పాత ఫియెట్ కారును బయటకు తీస్తే ఇప్పటి యువకులు దాని గురించి అతనిని అడుగుతారట! అతను సేకరించిన వాటిలో తనకు ఇష్టమైనవి ఏమిటో చెప్పమంటే చెప్పడం కష్టమేనట. ఆదిత్య వద్ద ఉన్న 1928 నాటి ఢిల్లీ మ్యాప్‌ను పరిశీలిస్తే దాదాపు 70 నుంచి 80 శాతం వరకు వ్యవసాయ, అటవీ భూమి ఢిల్లీలో కనిపిస్తుంది. పాతకాలపు వాడ్సన్ కారును సేకరించడానికి మూడు నెలల సమయం పట్టిందట! తాను సేకరించిన వాటిల్లో వింటేజ్ కార్లు అద్భుతమైనవిగా చెబుతాడు. అతను సేకరించిన వాటిలో అగ్గిపెట్టెలకు ప్రథమ ప్రాధాన్యతనిస్తాడు. కాలానుగుణంగా అగ్గిపెట్టెలలో పలుమార్పులు చోటు చేసుకున్నాయి. అగ్గిపెట్టెలపై ముద్రించిన చిత్రపటాలు మారుతున్న కాలానికి సంబంధించిన కథలు చెబుతాయి. అగ్గిపెట్టెలు తయారు చేసే సాంకేతికత మనకు లేని రోజులలో స్వీడన్ నుంచి దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ ఇప్పుడు భారత్ అగ్గిపెట్టెలను యూరప్‌కు పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తోంది.

ఆదిత్య విజ్ వస్తువుల సేకరణకు ఎక్కువగా ఢిల్లీలోని చాందినీ చౌక్, దరయాగంజ్ మార్కెట్లను ఎంచుకుంటాడు. అక్కడ నుంచి తన వస్తువుల సేకరణను ప్రారంభిస్తాడు. తన అభిరుచి తెలిసిన కొంతమంది మాత్రం ప్రత్యేకంగా తనవద్దకే వచ్చి వస్తువులను తెచ్చి ఇస్తారని ఆదిత్య చెబుతాడు. తాను సేకరించిన అన్ని రకాల వస్తువులతో తగిన విధంగా ఒక అద్భుతమైన మ్యూజియంను ఏర్పాటు చేయాలన్నదే తన లక్ష్యంగా చెబుతాడు. అప్పుడప్పుడూ కొంతమంది పిల్లల్ని తీసుకెళ్లి తన వద్ద ఉన్న వస్తువుల చరిత్రను వాళ్లకి వివరిస్తారు. ఆదిత్యవిజ్‌ను 'చరిత్ర వేటగాడు' గా అభివర్ణిస్తూ దూరదర్శన్ అతని గురించి ప్రసారం చేసింది. తాను సేకరించిన వాటికి డబ్బుతో విలువ కట్టలేమని మాత్రం ఘంటాపథంగా చెబుతాడు.

కె.ఎస్‌ఎమ్

బాదుషా

కావాల్సిన పదార్థాలు

మైదా- 1 కప్పు
నెయ్యి-2 టీ స్పూన్లు
బేకింగ్ సోడా-చిటికెడు
పెరుగు-1/2 కప్పు
నీరు-1 కప్పు
యాలకుల పొడి- చిటికెడు
డ్రై ఫ్రూట్స్- గార్నిష్ కోసం
నూనె- వేయించడానికి సరిపడా

తయారుచేసే విధానం

ఒక బౌల్ తీసుకుని అందులో పెరుగు, నెయ్యి, బేకింగ్ సోడా బాగా కలపాలి. ఒక వెడల్పాటి గిన్నెలో మైదా, కొద్దిగా పెరుగు వేసి చపాతీ పిండిలా కలుపుకోవాలి. పిండిని పది నిమిషాలు నాననివ్వాలి. తర్వాత స్టౌపై మందపాటి పాత్ర వుంచి అందులో నీరు, పంచదార వేసి మరగనివ్వాలి. చిన్న మంటపై పల్లగా పాకం వచ్చేలా చూసుకోవాలి. ఇప్పుడు ముందుగా కలిపి పెట్టుకున్న మైదా పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసి చేత్తో వత్తాలి. స్టౌపై బాణలి పెట్టి నూనె వేసి వేడెక్కిన తర్వాత వత్తిపెట్టుకున్న మైదా ఉండల్ని బంగారు రంగు వచ్చే వరకు నూనెలో వేయించుకోవాలి. ఒక ప్లేట్‌లో టిష్యూ పేపర్ వేసి వేయించుకున్న బాదుషాలని ఐదు నిమిషాలు అందులో ఉంచాలి. తర్వాత వాటిని పంచదార పాకంలో వేసి 5-6 గంటలు నాననివ్వాలి. ఇప్పుడు సర్వింగ్ ప్లేట్‌లో బాదుషాలని తీసుకుని డ్రైఫ్రూట్స్‌తో గార్నిష్ చేసి రుచి చూడండి.

కొబ్బరి బొబ్బట్లు



కావాల్సిన పదార్థాలు

మైదా- 1 కప్పు
పసుపు- 1/4 టీస్పూన్
నీరు- ఒక కప్పు
నూనె- తగినంత
బెల్లం- 1కప్పు
కొబ్బరి తురుము-1 కప్పు
ఏలకుల పొడి- 1 టేబుల్ స్పూన్
ఉప్పు- చిటికెడు
నెయ్యి- 2 టేబుల్ స్పూన్లు

తయారుచేసే విధానం

ఒక వెడల్పాటి గిన్నెలో మైదా, ఉప్పు, పసుపు, వేసి కొద్ది కొద్దిగా నీరు పోస్తూ కలుపుకోవాలి. పిండి కలిపాక అందులో కొద్దిగా నూనె వేసి మరోసారి కలిపి పదిహేను నిమిషాల పాటు పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టౌపై ఒక పాత్ర వుంచి అందులో కొద్దిగా నీరు బెల్లం వేసి బెల్లం కరిగేంత వరకు వుంచి దించేయాలి. ఈ నీటిని వడగట్టి ఒక గిన్నెలో పోసుకోవాలి. అందులో కొబ్బరి తురుము, యాలకుల పొడి కూడా వేసి స్టౌపై వుంచి తేమ పోయే వరకు ఉడికించుకోవాలి. ఇప్పుడు ముందుగా కలిపి పెట్టుకున్న పిండిని చిన్న ఉండలుగా చేసి చేత్తో వత్తి ఒక ప్లేట్‌లో పెట్టుకోవాలి. అందులో కొబ్బరి మిశ్రమాన్ని ఉంచి అంచులు మూసి ఉబ్బెత్తుగా లేకుండా చపాతీ కర్రతో వత్తాలి. స్టౌపై పెనం పెట్టి వేడెక్కిన తర్వాత నెయ్యి వేసి బొబ్బట్లని రెండు పక్కలా దోరగా కాల్చాలి. ఇప్పుడు సర్వింగ్ ప్లేట్‌లో వేడి వేడి బొబ్బట్లని వుంచి వాటిపై నెయ్యివేసి అతిథులకందించండి.

తీపి పొంగలి

కావాల్సిన పదార్థాలు

బియ్యం-1 కప్పు
పెసరపప్పు-1/2 కప్పు
పాలు-1 కప్పు
బెల్లం తరుగు-3 కప్పులు
జీడిపప్పు-10
కిస్‌మిస్-6
యాలకుల పొడి-1/2 టీస్పూన్, లవంగాలు-2
నెయ్యి-4 టేబుల్ స్పూన్లు
కుంకుమపువ్వు-చిటికెడు
నీరు-2 కప్పులు

తయారుచేసే విధానం





ముందుగా ఫ్రైయింగ్ ప్యాన్‌లో పెసరపప్పును వేసి రెండు మూడు నిముషాలు ఫ్రై చేసుకోవాలి. బియ్యాన్ని శుభ్రంగా కడిగి అందులో వేయించి పెట్టుకున్న పెసరపప్పు, పాలు పోసి బాగా కలిపి కుక్కర్‌లో పెట్టి మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికించి దించేయాలి. స్టౌపై ఒక పాత్ర ఉంచి నీరు, బెల్లం వేసి పాకం వచ్చే వరకు కలుపుతుండాలి. పాకం చిక్కబడే సమయంలో కుక్కర్‌లో ఉడికించిన అన్నం మిశ్రమాన్ని వేసి ఐదు నిమిషాలు మెత్తగా ఉడికించాలి. ఫ్రైయింగ్ ప్యాన్‌లో కొద్దిగా నెయ్యివేసి అందులో జీడిపప్పు, కిస్‌మిస్‌లని బంగారు రంగు వచ్చేవరకు వేయించి ఉడుకుతున్న పొంగలిలో వేసి కలపాలి. ఇప్పుడు లవంగాలు, కుంకుమపువ్వు, యాలకులు కూడా వేసి బాగా కలిపి రెండు నిమిషాల తర్వాత దించేయాలి.



ఆకులతో బొమ్మ

మనింటి ముందు రాలి పడుతుండే పచ్చి ఆకులు, ఎండుటాకులతో చిట్టెలుక బొమ్మ ఎలా చేయెచ్చో ఇక్కడ ఇచ్చాం! దాన్ని గమనించి మీరూ తయారుచేసేయండి!

కనిపెట్టండి



బంటీ, చింటు ఓ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుకుంటున్నారు. అక్కడ మనింట్లో వాడుకునే కొన్ని వస్తువులు కూడా దాగున్నాయి. కింద ఇచ్చిన బొమ్మల ఆధారంగా అవెక్కడున్నాయో కనిపెట్టి సున్నా చుట్టేయండి.

ఏ నీడ ఎవరిది



పిల్లలూ! ఇక్కడొక షార్క్(సొర చేప)ని వుంచాం. దాని ఎదురుగా వున్న నీడల్లో షార్క్ అసలైన నీడ ఎక్కడుందో గుర్తించి సున్నా చుట్టేయండి.

లెక్కించండి

ఇక్కడ చతురస్రంలో కొన్ని అంకెల్ని ఉంచాం. అయితే కింది వరుసలో ఒక అంకె మిస్సయింది. అది ఎంతైవుంటుందో కనిపెట్టండి!

క్లూ : రెండు నెంబర్లని గుణిస్తే మీకు సమాధానం దొరుకుతుంది.

జ: 18





దారి కనుక్కోండి

చింటు వాళ్ల అమ్మ మాట వినకుండా ఒక్కడే స్కూలికి బయల్దేరాడు. కొంత దూరం వెళ్లాక తీరా దారి మరిచిపోయాడు. స్కూల్‌కి వెళ్లే దారిని మీరు కనిపెట్టి చింటుకి సాయంచేయండి.

లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేనొక టాలీవుడ్ స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

జ: [illegible]

చుక్కలు కలపండి



ఫెల్ట్ పక్షి

పిల్లలూ మీ చిట్టి తమ్ముళ్లు చెల్లెళ్ల కోసం రకరకాల బొమ్మలు తయారుచేస్తుంటారు కదూ. మీకోసం ఫెల్ట్‌తో పక్షి బొమ్మ ఎలా తయారు చేయాలో మేం నేర్పిస్తాం. జాగ్రత్తగా తయారుచేయండే!

కావాల్సిన వస్తువులు

ఫెల్ట్ షీట్ -1 (నచ్చిన రంగుల్లో), స్కెచ్ పెన్, గుండీలు-2, రిబ్బన్, లేస్, కత్తెర, గమ్

తయారుచేసే విధానం

ముందుగా ఫెల్ట్ షీట్‌పై స్కెచ్ పెన్‌తో రెండు పక్షి ఆకారాలని గీసుకోవాలి. మరో రంగు ఫెల్ట్ షీట్‌పై పక్షి రెక్క ఆకారాన్ని గీయాలి. ఇప్పుడు వాటిని కత్తెరతో జాగ్రత్తగా కత్తిరించాలి. పక్షి ఆకారంపై రెక్క భాగాన్ని గమ్‌తో అతికించాలి. అది పూర్తిగా ఆరిన తర్వాత మీడియం సైజు గుండి నుండి లేస్‌ను తీసి బొమ్మలో చూపిన విధంగా ముడివేసి పక్షి రెక్క భాగంలో అతికించాలి. ఇప్పుడు స్టార్ ఆకారంలో వున్న గుండీని కంటి భాగంలో అతికించాలి. నచ్చిన రంగు రిబ్బన్ని రెండు సమాన భాగాలు వచ్చేలా కత్తిరించి

బొమ్మలో చూపిన విధంగా పక్షి అడుగు భాగంలో అతికించాలి. చివరిగా ఫెల్ట్ షీటుపై కట్‌చేసి పెట్టుకున్న మరో పక్షి ఆకారానికి గమ్ రాసి మీరు తయారు చేసిన బొమ్మకి ఇంకో వైపు అతికించాలి. గమ్ ఆరిన తర్వాత గుండీలు అతికించిన భాగంలో వాటిని సూదితో కుట్టేస్తే విడిపోకుండా ఉంటాయి. ఇప్పుడు ఈ బొమ్మని మీ చిట్టి చెల్లెళ్లు, తమ్ముళ్లకి అందించండి.





పదవికాసం - 34

కూర్పు: రావెళ్ల

ఆధారాలు

అడ్డం

2. ఒత్తులేని మున్ని (2)
4. అనేక (2)
6. తిరగబడ్డ విహంగం (2)
8. రోజులో సగం (2)
9. ఎక్కువ బలం (3)
11. బొట్టు (3)
16. భీముని ఆయుధం (2)
17. గోడకు కొట్టేది (3)
18. ఒక జాతి గడ్డి (2)
21. సముద్రము (3)
23. విరసం కాదు (3)
25. విత్తు ముందా? లేక ఇది ముందా అనే వాదులాట (2)
26. దిక్కు (2)
28. రాగం, పల్లవి తోడిది (2)
29. ఉపాయం (2)

1	✿	2	3	✿	4		✿	5
6	7	✿		✿		✿	8	
✿	9	10		✿	11	12		✿
13	✿		✿	14	✿		✿	15
16		✿	17			✿	18	
	✿	19	✿		✿	20	✿	
✿	21		22	✿	23		24	✿
25		✿		✿		✿	26	27
	✿	28		✿	29		✿	

నిలువు

1. కన్ను (2)
3. గృహం (3)
4. పతిమధ్య అక్షరంతో స్త్రీ(3)
5. పెట్టని.. అంటే రక్షణ(2)
7. పలక, బలపంలోని తొలి అక్షరాలు (2)
8. పూనకంలో దృతం లోపం(2)
10. వినోదం (2)
12. భిన్నంలో పైభాగం(2)
13. ముందడుగు(3)
14. ఇంటికి దొంగవేసేది (3)
15. వంశము(3)
19. గుప్తుల కాలపు యుగం(2)
20. చంద్రగుప్తుని తల్లి (2)
21. పెనం మీద కాలేది (2)
22. నమస్కారం (3)
23. ఒక నది (3)
24. .... పొద్దులకాడ సంపంగి నవ్వింది(2)
25. చెల్లించడం (2)
27. విడిది లాంటిది శీర్షాసనం వేసింది (2)

సుడోకు

		9		3	5			
	1				4		6	7
5							9	
7	3		9		8	2		5
8			3		6			9
9		1	5		2		8	6
	6							2
3	5		2				4	
			1	6		7		

గతవారం జవాబులు

9	7	1	2	3	8	4	5	6
5	2	3	7	4	6	8	1	9
4	6	8	1	5	9	3	7	2
1	3	5	4	6	7	9	2	8
6	4	7	8	9	2	5	3	1
8	9	2	3	1	5	7	6	4
2	5	4	6	8	3	1	9	7
7	8	9	5	2	1	6	4	3
3	1	6	9	7	4	2	8	5

✿	1 గ	2 ర	ళం	✿	3 వి	4 పు	ల	✿
5 ఏ	✿	క్రి	✿	6 బె	✿	లి	✿	✿
7 లు	కా	✿	8 వ	ణు	కు	✿	9 కా	10 యు
క	✿	11 గ	✿	కు	✿	12 న	✿	ణా
13 ల	వ	ణ	ము	✿	14 క్రి	భ	శ	దే
మం	✿	ము	✿	15 జే	✿	ము	✿	శ
16 దు	న్న	✿	17 చి	గు	రు	✿	18 మీ	సం
✿	✿	19 వ్య	✿	రు	✿	20 వా	✿	ధి
✿	21 కా	య	ము	✿	22 కూ	రి	మి	✿

గాజు లోకం

న్యూయార్క్‌లోని కార్నింగ్ మ్యూజియం కేవలం గాజు వస్తువులకు మాత్రమే. కళలు, చరిత్ర, సంస్కృతి, విజ్ఞాన శాస్త్రం, హస్తకళ తదితర విభాగాల్లో ప్రదర్శనలుంటాయి. ప్రపంచంలోనే అతి భారీ సేకరణ ఇది. సుమారు 45 వేల రకాల గాజు వస్తువులను వీక్షించే అవకాశం ఇక్కడుంది. 3500 ఏళ్లనాటి గాజు చరిత్రను కళ్ల ఎదుట నిలుపుతుందీ మ్యూజియం. అమెరికాలోని గాజు పరిశ్రమ కేంద్రంగా పరిగణించే ఫింగర్ లేక్స్ ప్రాంతంలో 1951లో దీన్ని ఏర్పాటు చేశారు. ఈజిప్ట్ పాత కాలం నాటి ఫర్నేస్ మోడళ్లను కూడా ఇక్కడ చూడొచ్చు. గాజు పరిశ్రమలో వచ్చిన మార్పుల్ని కూడా తెలుసుకోవచ్చు. రోమన్లు, వెనిషియన్లు, ఉత్తరాది యూరోపియన్లతో పాటు ఆసియా, అమెరికాలకు చెందిన గాజు విప్లవాలకు చెందిన ఎన్నో వస్తువులుంటాయి. కార్నింగ్ పట్టణం ఒకప్పుడు వ్యవసాయ గ్రామం నుంచి క్రిస్టల్ సిటీగా ఎలా రూపాంతరం చెందిందో లాంటి అంశాలపై కూడా వస్తు ప్రదర్శన చేస్తారు. పేపర్ వెయిట్ల నుంచి బుల్లెట్ ప్రూఫ్ గాజు వరకు, అద్దం నుంచి కళ్లు తిప్పుకోని అందమైన కళా ఖండాల వరకు ప్రతీదీ ఇక్కడ పొందికగా గేలరీల్లో అమర్చి ఉంటుంది. ఇవే కాదు గాజుతో వస్తువులెలా తయారు చేస్తారో చూపే హాట్ గ్లాస్ షోలో గ్లాస్ బ్లోయర్ల ప్రదర్శన హైలెట్‌గా ఉంటుంది. గ్లాస్ ల్యాబ్, లైబ్రరీలు కూడా ఇందులో ఉన్నాయి.

Contact for Corporate Programs
Cell: 98481 90302

You have Problems?
I have Solutions !

సమస్యలతో రండి!
సక్సెస్‌తో దూసుకుపొండి...

నత్తి, డిప్రెషన్, గుండెదడ, నరాల బలహీనత, భయం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ప్రేమ వైఫల్యం, మద్యం, సిగరెట్లు, ఖైనీ, ఆత్మవిశ్వాసం లోపించడం, మరియు అనేక సమస్యలకు ఎంతో మంది నా వద్దకు వచ్చి హిప్నో-సైకోథెరపీ ద్వారా పరిష్కరించుకున్నారు. సక్సెస్ అయ్యారు, ఇక మీ వంతు, మీకు సమస్యలున్నా, సక్సెస్ కావాలన్నా భవిష్యత్‌లో స్థిరపడాలన్నా...

VIP Vidhatha *Institute of Personality Developmnet*

33ఏళ్ళ అనుభవంతో **వ్యక్తిత్వ వికాసం** రియల్ ఎస్టేట్, ఇన్సూరెన్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌కు నెట్‌వర్క్ మార్కెటింగ్ ప్రతినిధులకు షాపింగ్‌మాల్స్, హాస్పటల్ సిబ్బందికి స్కూల్స్, ఇంజనీరింగ్, మేనేజమెంట్ కాలేజిలకు, ప్రత్యేక శిక్షణకై సంప్రదించండి

నేనున్నాను !

Ψ క్రాంతికార్

(Psychologist , Hypno-Therapist & HRD trainer)
(PhD),MSc(Psychology),MSc(Counseling Psychology), MSc(App Psy), MA (Child Care),BSc(Psy),BA(Psy),BNat (Naturopathy & Yoga), DY(Yoga),YCC(Yoga),MBA(HR),MA(PPM), MA(S), MA(PPS), MLM,MA(GT), MA(Phy), BCom,HDSE & More

ప్రముఖ సైకాలజిస్ట్

చైల్డ్ సైకాలజీ

మీ పిల్లలో అల్లరి, టీ.వి. చూడటం, సెల్‌ఫోన్, నెట్ వాడటం, బద్ధకం, కోపం, మాట వినకపోవటం, ఎక్కువ అయిందా?
చదువు తగ్గిందా? కాలేజీకని చెప్పి తిరిగి తిరిగి వస్తున్నారా?
మీ పిల్లలు హీరోలు కావాలనుకుంటున్నారా?

త్రాగే వ్యక్తి కి తెలియకుండా మందు మాన్పించబడును.

websites : www.krantikar.blogspot.in
www.vidhatha.in, www.kranthikar.com
www.facebook.com/krantikar ye

Hyderabad : 93 93 11 2021, Vizag : 9440 633 610

Check List

Book Number	KNSR02B1W1	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mounika	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	29